
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 27.05.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 52 పేజీలు : 12, వెల : ₹ 5


ISO 9001-2008
Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For
State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# అక్రమాల పాపం నాయకత్వ లోపం



## » ఎవరి బలహీనతతో ఎవరు బలవంతులవుతారో...?

**చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చి రెండేళ్లయ్యింది. మరి ఈ రెండేళ్లలో ఆయన ఏం పొడిచాడు... రాష్ట్రాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళుతున్నాడు... ఆయన చెప్పిన హామీలను ఎంతవరకు నెరవేరుస్తున్నాడు... ప్రజాదరణ పెంచుకోవడానికి ఏమేం పనులు చేస్తున్నాడన్నది పెద్ద ప్రశ్న!**

ఈ రెండేళ్లలో చంద్రబాబు సాధించిన ఘనవిజయాలంటూ ఏమీ లేవు. ప్రజాదరణ పెంచుకోవడంకంటే ప్రజాదరణ కోల్పోయే విధంగా ఆయన పరిపాలనా విధానాలు ఉంటున్నాయి. 1995-2004ల మధ్య చంద్రబాబుకు మంచి అడ్మినిస్ట్రేటర్‌గా, అవినీతిని సహించని పాలకుడిగా పేరొచ్చింది. ఈ రెండేళ్ల పాలనలో ఆ రెండూ మాయమయ్యాయి. రాష్ట్రంలో రాజకీయ, అధికార అవినీతికి జడలు విచ్చుకున్నాయి. ప్రాజెక్టుల అంచనాలు ఇష్టానుసారం పెంచేసుకుంటున్నారు. చంద్రబాబు చేస్తున్న దుబారాలైతే లెక్కేలేదు.

అన్నింటిని మించి అమరావతి రాజధాని పేరుతో ఆడుతున్న డ్రామా ప్రజలకు విసుగుపుట్టిస్తోంది. ప్రజలకు ఏ మాత్రం ఉపయోగం లేని రాజధాని పైనే చంద్రబాబు తన సగం (మిగతా 11వ పేజీలో)

# రాయలసీమ 'రత్నం'

## • ఎంసెట్ చరిత్రను తిరగరాసిన రత్నం మాష్టారు!



ఎంసెట్ మెడికల్ టాపర్ హేమలతను అభినందిస్తున్న గవర్నర్ ఇ.సి.ఎల్.నరసింహన్, పక్కన కె.వి.రత్నం, పద్మావతి రత్నం మరియు హేమలత తల్లిదండ్రులు.

**విజయం ఎంత నిశ్శబ్దంగా వస్తుందో ఆనందం అంత ఘనంగా ఉంటుంది. రంకెల్లో కాదు అంకెల్లో... అరుపుల్లో కాదు... చదువుల మెరుపుల్లో... అనితర విజయమిది. 'రత్నం' మాష్టారుకే సాధ్యమైన ఘనతర విద్యాపయనమిది.**

ర్యాంకులు రావాలన్నా, రికార్డులను తిరగ రాయాలన్నా అది 'రత్నం'కే సాధ్యమని మరోసారి ఋజువయ్యింది. 2016 ఏపి ఎంసెట్ మెడికల్ ఫలితాల్లో నెల్లూరులోని రత్నం జూనియర్ కళాశాల విద్యార్థిని మాచాని హేమలత రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకును సాధించి, తాను చదివిన రత్నం విద్యా సంస్థలకు, తాను పుట్టిన రాయలసీమ(కర్నూలు) గడ్డకు కీర్తిప్రతిష్టలు తెచ్చింది. రాయలసీమ 'రత్నం'గా వెలుగులోకి వచ్చింది. (మిగతా 10వ పేజీలో)

A.P. EAMCET-2016 ఫలితాలలో మెడికల్ విభాగంలో
స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌తో గురితప్పని రత్నం విజయం
గుర్తుండిపోయే నెం.1 విజయం

STATE MEDICAL 1st RANK



EAMCET MARKS
156
160
M. HEMALATHA
H.T.No. 966490185



స్టేట్ మెడికల్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన చి॥ యం. హేమలతను అభినందిస్తున్న నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు గౌ॥శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ గంటా శ్రీనివాసరావు గారు, శ్రీ కామినేని శ్రీనివాస్ గారు మరియు కళాశాల చైర్మన్ శ్రీ కె.వి.రత్నం గారు

ఎంసెట్ మెడికల్ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకుతో పాటు మరెన్నో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన మా విద్యార్థినీ, విద్యార్థులకు హార్థిక శుభాభినందనలు. ఈ ఘనమైన ఫలితాలకు కారకులైన మా అధ్యాపకులకు మరియు సిబ్బందికి శుభాకాంక్షలు...

2017 NEET (MEDICAL) LONG TERM COACHING
Classes start from.. 9-6-2016

Bharadwaj Campus
Haranadhapuram
Ph: 8008304747

Bhargav Campus
Beside Iskon
Ph: 8886666814, 7842880888

Bhavani Campus (Girls)
Dargamitta
Ph: 7207401255

RATNAM EDUCATIONAL INSTITUTIONS

RATNAM
MEDICAL ACADEMY
NELLORE, ANDHRA PRADESH

## ప్రతి కార్యకర్తకు అండగా టిడిపి

తెలుగుదేశంపార్టీలో చేరే ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని మాజీమంత్రి, నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నెల్లూరురూరల్ పరిధిలోని 32వ డివిజన్‌కు చెందిన దాదాపు 500మంది వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు ఆదాల ఆధ్వర్యంలో తెలుగుదేశంపార్టీలో చేరారు. ఈ సందర్భంగా వైయస్సార్సీపీకి చెందిన నాయకులు హరిశ్చంద్రారెడ్డి, నవీన్‌రెడ్డి, నారాయణ రెడ్డి, ఆనందరావు, కరిముల్లా, సత్తాజ్ తదితరులు కొత్తూరు సెంటర్‌లో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. వారందరికీ ఆదాల పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం కేవలం చంద్రబాబునాయుడిపై విశ్వాసంతోనే ప్రజలు పట్టం కట్టారని, రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆనం జయకుమార్‌రెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, వై.వి.రామిరెడ్డి, హరిబాబుయాదవ్, పేర్నేటి కోటేశ్వరరెడ్డి, ఏసునాయుడు, ఖాజావలి, జాకీర్ పాల్గొన్నారు.

## వైభవంగా చెన్నకేశవుని రథోత్సవం

గూడూరు పట్టణంలో వెలసివున్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఉదయం చెన్నకేశవుడు దేవేరులతో కలసి పురవీధుల్లో రథంపై ఊరేగారు. రథాన్ని లాగటానికి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో దేవాలయ ప్రాంగణం అంతా కిక్కిరిసి పోయింది. రథం లాగేటప్పుడు భక్తులు చేసిన గోవిందనామస్మరణలు పురవీధుల్లో మార్మోగాయి. ప్రతి ఇంటి ముందు భక్తులు స్వామివారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

# కోవూరు షుగర్ ఫ్యాక్టరీని తెరవాలి


ఇటీవల మూతపడిన కోవూరు షుగర్ ఫ్యాక్టరీని తెరిచి రైతులను, కార్మికులను ఆదుకోవాలని వవ్వేరు బ్యాంక్ ఛైర్మెన్ సూరా శ్రీనివాసులురెడ్డి కోరారు. వవ్వేరు కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కోవూరు షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించి 3400మంది రైతులు, 800 మంది ఉద్యోగులు వున్నారని, గతంలో పనిచేసిన పాలకమండళ్ళు, సిబ్బంది అక్రమాలతో సుమారు 20 కోట్ల దాకా ఫ్యాక్టరీకి నష్టం వాటిల్లిందని అన్నారు. ఈ ఫ్యాక్టరీని పున:ప్రారంభించి రైతులకు, కార్మికులకు జీవనోపాధి కల్పించాలని ఆయన అన్నారు. ఆ మేరకు స్థానిక ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కూడా ఈ ఫ్యాక్టరీని మళ్ళీ ప్రారంభింపజేస్తామని గతంలో హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని ఆయన అన్నారు. ఫ్యాక్టరీకి చెందిన రైతులందరితో కలిపి కమిటీ ఏర్పాటుచేసి, అందులో వవ్వేరు బ్యాంక్‌కు స్థానం కల్పించాలని, ఈ కమిటీ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ పనిచేసేవిధంగా చూడాలని సూచించారు. ఫ్యాక్టరీ పరిసరాల్లో దాదాపు 30కిలో మీటర్ల పరిధిలో చెరకు పండించే భూములు ఎక్కువగా వున్నాయని, కనుక ఫ్యాక్టరీకి నష్టం వచ్చే పరిస్థితే లేదని అన్నారు. ఈ విషయాలన్నిటినీ త్వరలో ఉన్నతాధికారులు, మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకువెళ్తామన్నారు. ఈ సమావేశంలో బ్యాంక్ ఉపాధ్యక్షుడు షేక్ షఫీతో పాటు డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ఇఫ్కో కిసాన్‌సెజ్‌లో ఆటోమొబైల్ కంపెనీ?

**• కొరియా బృందం పర్యటన**

నెల్లూరుజిల్లా కొడవలూరు మండలంలోని రేగడిచెలిక వద్దగల ఇఫ్కో కిసాన్‌సెజ్‌లో కొరియా దేశానికి చెందిన ఆటోమొబైల్ కంపెనీ స్థాపన కోసం సుమారు 900ఎకరాల స్థల పరిశీలన కోసం ఆ దేశానికి చెందిన పదిమంది ఇంజనీర్ల బృందం పర్యటించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన సింగిల్ డెస్క్ విధానంతో ఆకర్షితులై కొరియా బృందం ఆసక్తి చూపుతున్నట్లు ఏపిఐఐసి అధికారులు పేర్కొన్నారు. బృంద సభ్యులు ఇఫ్కోలో భూములను పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన మేరకు ఆటోమొబైల్ కంపెనీ పెట్టేందుకు సుమారు 900ఎకరాల భూమి అవసరమై జిల్లాలో పర్యటిస్తున్నట్లు కొరియా బృందం పేర్కొంది.

ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ఏపిఐఐసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## బంగారమ్మ జాతరలో జబర్దస్త్ సందడి

నెల్లూరుజిల్లాలోని మైపాడు తీరం ఒడ్డున బంగారమ్మ జాతర ఉత్సవంలో జబర్దస్త్ టీం చేసిన సందడి కడుపుబ్బ నవ్వించింది. ఇటీవల ఇందుకూరుపేట మండలం మైపాడుపాలెంలోని సీతారామ ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం, బంగారమ్మ జాతర ఉత్సవాలు వేడుకగా జరిగాయి. ఆదివారం రాత్రి సముద్రం ఒడ్డున ఏర్పాటు చేసిన జబర్దస్త్ టీం హంగామా నవ్వుల జల్లులు, పాడుతా తీయగా అనే కార్యక్రమం పేరుతో పాటలను హృద్యంగా అలరించింది. ఈటీవీలో ప్రసారం అవుతున్న జబర్దస్త్ కార్యక్రమంలోని టీమ్ లీడర్ సుడిగాలి సుధీర్, గెటప్ శీను, రామ్‌ప్రసాద్ చేసిన సందడి కడుపుబ్బా నవ్వించింది. ఈ సందర్భంగా కళాకారులను ఎంపిటిసి సభ్యుడు శ్రీహరికోట ప్రసాద్, ఊటుకూరు నాగరాజు తదితరులు ఘనంగా సత్కరించారు.

## పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలి

**- డిఎస్పీ వెంకటరాముడు**

పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని, తద్వారా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత పోలీసు సిబ్బందిని నెల్లూరు డిఎస్పీ వెంకటరాముడు ఆదేశించారు. ఈ నెల 21న ఆయన 5వ నగర పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు కేసులు పరిష్కారానికి నోచుకోకపోవడాన్ని గమనించిన డిఎస్పీ, ఆ కేసుల విచారణలో ఎందుకు జాప్యం జరుగుతోందని ఇన్‌స్పెక్టర్ మంగారావును ప్రశ్నించారు. కేసులన్నిటినీ త్వరితగతిన పరిష్కరించాలని ఆయన సూచించారు.

# ఫలించిన కోటంరెడ్డి పోరాటం

## • వల్లూరు కాలువకు నీళ్ళు



నెల్లూరురూరల్ పరిధిలోని వల్లూరు కాలువ క్రింద మాదరాజుగూడూరు, లింగాయపాలెం గ్రామాలలో రెండో పంటకు నీళ్ళు వదలాలని చేసిన గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పోరాటం ఎట్టకేలకు ఫలించింది. ఈ నెల 25వ తేదీన వల్లూరు కాలువ క్రింద రెండో పంటకు ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కూడా సంతోషంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నీళ్ళ కోసం 15రోజులు పోరాటం చేయాల్సి వచ్చిందని, ఆరుసార్లు ఇరిగేషన్ ఆఫీసు చుట్టూ తిరిగానని, వర్షంలో తడుస్తూ కూడా ధర్నా చేసామని అన్నారు. నెల్లూరురూరల్ నియోజక వర్గంలో ఎవరైనా రైతుల కడుపు కొట్టాలని చూస్తే వేటకుక్కలా వెంటపడి తరుము తానని, రైతుల రక్షణ కోసం కాపలా కుక్కలా వుంటానని ఆయన చెప్పారు.

# నవ్యాంధ్ర విద్యా పరిరక్షణ సమితిపై 'పాత పేపరు రోత రాతలు'

నవ్యాంధ్రలో జరుగుతున్న భారీ విద్యా దోపిడీపై నినదిస్తూ ప్రారంభించబడిన "నవ్యాంధ్ర విద్యా పరిరక్షణ సమితి"పై జిల్లాలోని ఓ పాత వారపత్రిక రోత రాతలు రాసి ఉద్యమాన్ని విమర్శించే ప్రయత్నం చేసింది. కోట్ల రూపాయలు చేతులు మారాయి అంటూ అవాకులూ చవాకులూ పేలింది. ఒక సత్సంకల్పంతో ప్రారంభించబడిన "నవ్యాంధ్ర విద్యా పరిరక్షణ సమితి'పై బురద చల్లడానికి విశ్వప్రయత్నం చేసింది. ఆ పాతపేపరుపై "నవ్యాంధ్ర విద్యా పరిరక్షణ సమితి" చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతోంది. నిరాధారమైన వార్తలతో ఉద్యమ సంస్థను, సంస్థ సారధులను అవమానించడం దారుణమైన విషయం. చేతనైతే, చేవ ఉంటే తమ రోతరాతలను ఋజువు చేసుకోవాలి. లేని పక్షంలో సంస్థ తీసుకోబోయే చట్టపరమైన చర్యలను ఎదుర్కోక తప్పదు.

ప్రజలు చాలా విజ్ఞత కలిగినవాళ్ళు. ఎవరైనా ఒక ప్రెస్ కాన్ఫరెన్స్ పెడితే నాలుగు కోట్లు ఇస్తారా..? అన్నది ఆలోచించగల సమర్థులు. కేవలం చేతిలో పెన్ను వుంది కదా అని ఇలాంటి కట్టుకథలను డోలు వాయించి దండోరా వేసినా ఎవ్వరూ నమ్మరు. ఎవరు ఎలాంటి వాళ్ళో, ఎవరి చరిత్ర ఎంత ఘనమైందో నెల్లూరీయులకి బాగా తెలుసు.

# ఎస్ఐపై ప్రసన్న ఫైర్



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ

కొడవలూరు ఎస్ఐ కె.వి.నారాయణరెడ్డి అవినీతికి ప్రతిరూపంగా మారిపోయి లంచాలు లేనిదే పని చేయడం లేదని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీకి సమర్పించిన వినతిపత్రంలో ఫిర్యాదు చేశారు. కొడవలూరు పోలీసుస్టేషన్‌కు రావాలంటేనే బాధితులు భయపడుతున్నారు. లంచాలు ఇచ్చిన వాళ్లకే ఇక్కడ మర్యాదలు జరుగుతున్నాయి. ప్రతి కేసుకు మంచి చెడు అని లేకుండా లంచమే ప్రామాణికంగా ఉంటోంది. స్టేషన్‌లో సిబ్బందితో సైతం ఇతనికి సఖ్యత లేదు. గూడూరు టూటౌన్ ఎస్ఐగా పనిచేసినప్పుడు కూడా అక్కడి సిబ్బందితో గొడవపడి వున్నాడు. గూడూరు హైవే మొబైల్ డ్యూటీ చేస్తున్నప్పుడు తమిళనాడు లారీలకు 2000రూపాయలు ఫైన్‌వేసి తీసుకుని దానిని 200 రూపాయలుగా దిద్ది మిగతా సొమ్మును కాజేసేవాడు. దీనిమీద ఇప్పుడు విచారణ జరుగుతోంది. ఇలాంటి ఎస్ఐ కొడవలూరు మండల ప్రజలకు అవసరం లేదు. కాబట్టి ఆయనను విఆర్‌లో వుంచి మంచి ఎస్ఐను నియమించాలని ఆయన ఆ వినతిపత్రంలో కోరారు.

# అరుణమ్మ లేని లోటు తీర్చలేనిది

## - వక్తల నివాళి



అరుణమ్మకు నివాళులర్పిస్తున్న వివిధ రాజకీయపార్టీల నాయకులు

మహిళా కాంగ్రెస్ నాయకురాలిగా ప్రజలకు ఆదర్శవంతమైన సేవలందించిన పందిళ్ళపల్లి అరుణమ్మ మృతి తీరని లోటని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జరిగిన అరుణమ్మ సంతాపసభలో పాల్గొన్న కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, సీనియర్ నాయకుడు సివి శేషారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొని అరుణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీకి అరుణమ్మ చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, పలు పార్టీల నాయకులు జక్కా వెంకయ్య, పద్మశ్రీ, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బొబ్బల శ్రీనివాస యాదవ్, మోహన్‌రావు, రామరాజు తదితరులతో పాటు అరుణమ్మ భర్త పట్టాభి రామిరెడ్డి, కుమారుడు హేమంత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.








# శ్రీసిటీలో జపాన్ బృందం

## ఇండియాలోనే నెంబర్‌వన్ పారిశ్రామికవాడ అంటూ ప్రశంస

డైరెక్టర్ జనరల్ ఆఫ్ జపాన్ మినిస్టర్ ఆఫ్ ఎకానమి, ట్రేడ్, ఇండస్ట్రీ సీజీ టకాగీ సారధ్యంలో 50మంది పారిశ్రామికవేత్తల బృందం 25వ తేదీన శ్రీసిటీని సందర్శించింది. శ్రీసిటీ ప్రెసిడెంట్ రమేష్ సుబ్రహ్మణ్యం వీరికి సాదరస్వాగతం పలికారు. అనంతరం బిజినెస్ సెంటర్‌లో ఏర్పాటైన ప్రత్యేక సమావేశంలో శ్రీసిటీ మౌలికవసతులు, అనుకూలతలు, ప్రగతి గురించి రమేష్ సుబ్రహ్మణ్యం పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. శ్రీసిటీలో 26దేశాలకు చెందిన 120పరిశ్రమలు ఏర్పాటు చేస్తుండగా, అందులో అత్యధికంగా జపాన్ దేశ పరిశ్రమలే వున్నాయన్నారు. జపాన్ పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక ఎంక్లేవ్, ట్రాన్స్‌లేటర్, ఫుడ్‌కోర్టు, గోల్ఫ్‌కోర్సు ఇతర వసతులు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇంకా శ్రీసిటీకి వున్న ప్రత్యేక అనుకూలతలు, రోడ్డు, రవాణా, పోర్టు సౌకర్యాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలను ఆయన నివృత్తి చేశాడు.

సీజీ టకాగీ శ్రీసిటీ మౌలిక వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. జెట్రో చీఫ్ డైరెక్టర్ జనరల్ టొషికా తకటొరి మాట్లాడుతూ శ్రీసిటీ అత్యంత వేగంగా అభివృద్ధి సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇండియాలో నెంబర్ వన్ పారిశ్రామికవాడగా శ్రీసిటీని అభివర్ణించారు. ఇంకా శ్రీసిటీ సెజ్ డెవలప్‌మెంట్ కమిషనర్ అనిల్ కె చౌదరి, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రాజేంద్రరెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రామలింగరాజు, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# 'ప్రభా'తం

ఐదు రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసాయి. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఫలితాలు వచ్చాయి. తమిళనాడులో అన్నాడిఎంకె మళ్ళీ అధికారంలోకి వచ్చింది. ఇదొక రికార్డు. వరుసగా రెండోసారి అధికారంలోకి రావడం అక్కడ ఒక రికార్డే! జయలలిత ఈసారి ప్రజల్లో వ్యతిరేకత తెచ్చుకోలేదు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదు. ఉచిత పథకాలను పక్కాగా అమలు చేసి ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకోవడం ద్వారా గెలుపు సాధించగలిగింది. ఇక పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ తిరుగులేని విజయం సాధించింది. ఇది కేవలం ఆమె పాలనా దక్షతకు ప్రజలిచ్చిన గౌరవం. కేరళలో అవినీతి వివాదాలతో అంటకాగిన కాంగ్రెస్‌ను గద్దెదించి కమ్యూనిస్టులకు అధికారం దాఖలు పరిచారు. అస్సాంలో ఓట్ల బ్యాంక్ రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్‌ను సాగనంపి, ఐదేళ్ల క్రితం అసలు ఉనికే లేని బీజేపీని అధికార పీఠంపై కూర్చోబెట్టారు. ఇక పుదుచ్చేరిలో ఏఐఎన్ఆర్‌సిని కాదని ప్రజలు కాంగ్రెస్, డిఎంకె కూటమిని గెలిపించినా ఇది చెప్పుకోదగ్గ విజయం కాదు.

అయితే ఈ ఐదు రాష్ట్రాల ఫలితాలు ఎలాంటి సందేశాన్ని ఎలాంటి పరిణామాలను సూచిస్తున్నాయన్నది ప్రశ్న! ఈ ఫలితాలు చూసాక ఎవరికైనా 2014ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన 'కాంగ్రెస్ ముక్త భారత్' నినాదం గుర్తుకురాక మానదు. దేశంలో ఎన్నో రాజకీయపార్టీలున్నాయి. ఆఖరకు జాతీయవాదంతో విభేదించే వామపక్షాలు కూడా ఉన్నాయి. కాని నరేంద్రమోడీ కాంగ్రెస్ లేని భారత దేశం కోసమే పిలుపునిచ్చారు. ఇప్పుడు దేశ రాజకీయాలు ఆ దిశగా పయనిస్తున్నాయా? అన్న అనుమానం రాకమానదు. కొత్తగా ఎన్నికలు జరిగిన ఐదు రాష్ట్రాలను చూస్తే రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌పార్టీ అధికారాన్ని కోల్పోయింది. కేరళను కమ్యూనిస్టులకు, అస్సాంను బీజేపీకి అప్పగించింది. కాంగ్రెస్‌పార్టీ ఒక్కో రాష్ట్రంలో అంతర్ధానమవుతూ క్రమంగా ఒక్కో రాష్ట్ర రాజకీయ చిత్రపటం నుండి తెరమరుగవుతుంది.

ఒకప్పుడు దేశమంతా కాంగ్రెస్‌పార్టీయే ఉండేది. కాంగ్రెస్‌కు ధీటైన జాతీయ పార్టీ దేశంలో కనిపించేది కాదు. జమ్మూకాశ్మీర్ నుండి కేరళ దాకా ఆ పార్టీ అన్ని రాష్ట్రాల్లోనూ అధికారపక్షంగానో లేక ప్రతిపక్షంలోనైనా ఉండేది. అలాంటి జాతీయ పార్టీ ఈరోజు గట్టిగా ఆరు రాష్ట్రాలలో మాత్రమే అధికారంలో వుంది. వాటిలో పెద్ద రాష్ట్రంగా ఉండేది కర్నాటకనే! మిగతావన్నీ చాలా చిన్న రాష్ట్రాలే!

పెద్ద రాష్ట్రాల్లో ఒక్క దాంట్లోనూ కాంగ్రెస్ అధికారంలో లేదు. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ, బీహార్‌లో దళ్(యు), పశ్చిమబెంగాల్‌లో టిఎంసి, తమిళనాడులో అన్నాడిఎంకె, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం వంటి ప్రాంతీయపార్టీలు రాజ్యమేలుతున్నాయి. బీజేపీ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ వంటి పెద్ద రాష్ట్రాలతో పాటు హర్యానా, అస్సాం, గోవా, జమ్మూకాశ్మీర్, చత్తీస్‌గఢ్, పంజాబ్, జార్ఖండ్ వంటి చిన్నరాష్ట్రాల్లో కూడా సొంతంగా లేదంటే మిత్రపక్షాలతో కలసి అధికారం పంచుకుంటుంది. ఒక జాతీయపార్టీ మనుగడ సాగాలంటే ప్రతి రాష్ట్రంలోనూ అధికారపక్షంగానో, లేక ప్రతిపక్షంగానో ఉండాలి. అలా ఉంటేనే పార్లమెంట్ ఎన్నికలలో ఒక సంఖ్యను చేరుకోవడానికి సులభమవుతుంది.

ఈరోజు కాంగ్రెస్ కంటే కూడా బీజేపీ ఎక్కువ రాష్ట్రాల్లో విస్తరించి వుంది. ప్రతి రాష్ట్రంలో వాళ్ల అధికారం లక్ష్యంగా పని చేయడం లేదు, ప్రతి రాష్ట్రంలోనూ బీజేపీని ఒక బలమైన శక్తిగా నిలిపే ప్రయత్నాలు మాత్రమే చేస్తున్నారు. ఈ క్రమంలో వాళ్ల బీహార్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, జార్ఖండ్, పంజాబ్, కాశ్మీర్, అరుణాచల్‌ప్రదేశ్, కర్నాటక, గుజరాత్, హర్యానా, అస్సాం, రాజస్థాన్, ఢిల్లీ... వంటి మెజార్టీ రాష్ట్రాల్లో అధికారంలోనో, లేదా ప్రతిపక్షంలోనో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, పశ్చిమబెంగాల్, ఒరిస్సా వంటి రాష్ట్రాల్లో సైతం విస్తరించడానికి భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ఒక్కో రాష్ట్రం నుండి కనుమరుగవుతోంది. కర్నాటక తప్పితే చెప్పుకోదగ్గ పెద్ద రాష్ట్రాలేవీ చేతులో లేవు. ఇటీవల వరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌కు కంచుకోటలా ఉండేది. ఆ రాష్ట్ర విభజన ద్వారా కాంగ్రెస్ అక్కడ కూడా నామరూపాలు లేకుండా పోయింది.

## కాంగ్రెస్ రహిత భారత్

**కాంగ్రెస్ విధానాలు ఈ కాలానికి సరిపోవు. వారు ఊగులాడుతున్న సెక్యులర్ విధానాలు బూజుపట్టిపోయాయి. సెక్యులర్ అంటే అన్ని మతాలను సమానంగా చూడడం. అంతేకాని ఒకట్రెండు మతాలను నెత్తిన పెట్టుకోవడం కాదు. కాంగ్రెస్ అతిసెక్యులర్ విధానాలతో పాటు అవినీతి కుంభకోణాలతో దేశ వ్యాప్తంగా ప్రతిష్ట కోల్పోయింది. ఆ పార్టీ భావిప్రధానిగా చెప్పబడుతున్న రాహుల్‌పై ప్రజల్లో నమ్మకం లేదు.**

ముఖ్యంగా ఆయా రాష్ట్రాల్లో కొత్తగా పుట్టుకొస్తున్న ప్రాంతీయ పార్టీలు కూడా కాంగ్రెస్ ఓట్లనే కొల్లగొడుతున్నాయి. బీజేపీ సాంప్రదాయ ఓట్లు అలానే ఉంటుండగా మిగతా పార్టీలన్నీ కూడా సెక్యులర్ ఓట్లను పంచుకుంటున్నాయి. ఇది బీజేపీకి ఉపయోగపడుతోంది.

కాంగ్రెస్ విధానాలు ఈ కాలానికి సరిపోవు. వారు ఊగులాడుతున్న సెక్యులర్ విధానాలు బూజుపట్టిపోయాయి. సెక్యులర్ అంటే అన్ని మతాలను సమానంగా చూడడం. అంతేకాని ఒకట్రెండు మతాలను నెత్తిన పెట్టుకోవడం కాదు. కాంగ్రెస్ అతిసెక్యులర్ విధానాలతో పాటు అవినీతి కుంభకోణాలతో దేశ వ్యాప్తంగా ప్రతిష్ట కోల్పోయింది. ఆ పార్టీ భావిప్రధానిగా చెప్పబడుతున్న రాహుల్‌పై ప్రజల్లో నమ్మకం లేదు. మతోన్మాద పార్టీగా ముద్రపడ్డప్పటికీ బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి విధానాలకే పెద్దపీట వేస్తుంది. మతపరమైన అంశాలను పక్కనపెడుతూ వివిధ రంగాలలో దేశాన్ని ముందుకు తీసుకెళుతున్న ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.

ఇక ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ముఖ్యమంత్రులు సైతం తమ ప్రభుత్వాలను అత్యంత సమర్ధవంతంగా నడుపుతూ, తమ రాష్ట్రాల పురోభివృద్ధికి కృషి చేస్తూ ప్రజాదరణ పొందుతున్నారు. అటు జాతీయ పార్టీగా బీజేపీ, ఇటు ఆయా రాష్ట్రాల్లో బలమైన ప్రాంతీయపార్టీల మధ్య పోటీని తట్టుకోలేక కాంగ్రెస్ మరుగుజ్జు అవుతోంది.

## రమణీయంగా రథోత్సవం



నెల్లూరు ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కాశీవిశ్వనాథ స్వామి వారి రథోత్సవం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. హరహరమహాదేవ... శంభో శంకర... ఓం నమఃశివాయ అంటూ భక్తుల నామస్మరణతో రథోత్సవం నగర పురవీధులలో ఊరేగింది. అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథుని దర్శించుకుని భక్తజనం తన్మయత్వం చెందారు. దారి పొడవునా భక్తులు కర్పూరహారతులు పట్టి, టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఉస్మాన్‌సాహెబ్ పేట ప్రధానమార్గం నుండి రేబాలవారివీధి, స్టోన్‌హౌస్‌పేట మెయిన్‌రోడ్డు, తడికలబజార్ సెంటర్ మీదుగా దేవస్థానంకు రథోత్సవం చేరుకుంది. దేవస్థాన ప్రధానార్చకుడు వందవాసి విశ్వనాథ గురుకుల్ ఆధ్వర్యంలో వేద పండితులు తొలుత స్వామివారికి అభిషేకం, పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమపూజు అనంతరం యాగశాల, బలిపూజలు, రథపూజ, రథవడి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, రాజేశ్వరమ్మ, పత్తి జయరామయ్యనాయుడు, పద్మావతమ్మ దంపతులు వ్యవహరించారు. కార్పొరేటర్ జడ్. శివప్రసాద్, మాజీకార్పొరేటర్ సాయిలలిత తదితరులు పాల్గొన్నారు. రెండవ నగర సిఐ సుధాకర్‌రెడ్డి సిబ్బందితో బందోబస్తును పర్యవేక్షించారు. తొలిసారిగా రథోత్సవాన్ని డ్రోన్ కెమెరాతో చిత్రీకరించారు. సభ్యులు వేమూరు కిషోర్‌కుమార్, ఎర్ర వెంకటవిజయ్‌కుమార్, ఎర్ర సాయి శ్రీనివాసులు, పత్తి మల్లిఖార్జున, తంగిళ్లపల్లి వెంగయ్య, బైరపోగు సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

### న్యాయ పరిపాలనలో

## శిక్షణకు దరఖాస్తులు

2016-17 సంవత్సరానికి న్యాయ పరిపాలనలో 3సంవత్సరాలు శిక్షణ పొందుటకు నెల్లూరుజిల్లాకు చెందిన అర్హులు అయిన క్రిస్టియన్ మైనారిటీస్ కులాలకు చెందిన 40సంవత్సరాల లోపు వయస్సు గల న్యాయ శాస్త్ర పట్టభద్రుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపి రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహమ్మద్ షంషుద్దీన్ ఒక ప్రకటనలో కోరారు. నెల్లూరు బొల్లినేని హాస్పిటల్ ప్రక్కనున్న కార్యాలయంలో ఈనెల 30వతేదీలోగా దరఖాస్తు ఫారాలను పొంది జూన్ 5వతేదీలోగా నిర్ణీత ధృవీకరణ పత్రాలతో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయానికి సమర్పించాలని కోరారు. ఇతర వివరాలకు 98499 01154 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

## వృద్ధులకు చీరల పంపిణీ




వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న భవాని నాగేంద్రప్రసాద్, సి.వి.శేషారెడ్డి

భారత మాజీప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఈ నెల 21వ తేదీన రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు భవాని నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల ఆశ్రమంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సేవాదళ్ ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి మాజీఎమ్మెల్యే సి.వి.శేషారెడ్డి, ఆశ్రమ వ్యవస్థాపకులు తమ్మినేని పాండు పాల్గొన్నారు.




## ముందుంది మొసళ్ల పండుగ

చేతిలో అధికారం వుంది కదా అని చంద్రబాబు ఆపరేషన్ ఆకర్ష్‌ను పెట్టి వైకాపా ఎమ్మెల్యేలను తెలుగుదేశంలో చేరుస్తున్నాడు. చూడ్డానికి ఇప్పుడు బాగానే ఉంటుంది. కాని ముందుంది మొసళ్ళ పండుగ. ప్రతి నియోజకవర్గంలో పాత, కొత్త నాయకుల మధ్య వర్గపోరు, తన్నులాటలు తప్పవు. ఇప్పటికే మినీ మహానాడులలో తమ్ముళ్ళ మధ్య తగువులు మొదలయ్యాయి. భవిష్యత్‌లో ఇవి మరింత తీవ్రరూపం దాల్చనున్నాయి. త్వరలోనే ఈ తలనొప్పి ఎందుకు పెట్టుకున్నానురా దేవుడా...! అని చంద్రబాబు బాధపడే పరిస్థితి రావచ్చు.

**కె.ఎస్.ఆర్., నెల్లూరు.**

## జీతాలకు తగ్గ పనిచేయండి

ఆచార్య ఉద్యోగానికి మన దేశంలో అత్యున్నత గౌరవం వుంది. ఒకప్పుడు బ్రతక లేక బడిపంతులన్నారు. ఇప్పుడు బడిపంతుళ్ళ జీతాలు బ్రహ్మాండంగా ఉన్నాయి. అయితే అయ్యవార్లు పాఠశాలలకు సరిగ్గా పోవట్లేదు! పాఠాలు చెప్పట్లేదు! పిల్లలు రావడం లేదని వీళ్లు, టీచర్లు రావడం లేదని పిల్లలు... ఇద్దరు కలిసి ప్రభుత్వ బళ్లు ఎగ్గొడుతున్నారు. కొందరు టీచర్లు ఇతర వ్యాపారాలు చేసుకుంటూ తమ బదులు బినామీ టీచర్లను పంపుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరిస్తేనే గాని ఇలాంటి టీచర్లు దారికిరారు.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## ఎన్నికల సంఘం పట్టించుకోవాలి

ఓటుకు డబ్బులిచ్చినా, తీసుకున్నా నేరమే! మరి తమిళనాడు ఎన్నికల్లో జరిగిందేమిటి? ఒక్కో ఓటుకు ఎంత ఖరీదు కట్టారో తెలుసా? ఓటుకు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లు, సైకిళ్లు, తాళిబొట్లు, టీవీలు, మిక్సర్‌లు, గ్రైండర్లు... అన్నీ ఫ్రీ. ఇదీ ఓటుకు లంచం లాంటిదే! ఒక్క పార్టీ అన్నా రోడ్లు, తాగునీళ్లు, విద్య, వైద్యం వంటివాటి గురించి చెప్పిందా? జనాలు కూడా ఆలోచించాలి! చదువులకు, రోగాలకు లక్షలకు లక్షలు ఖర్చు పెడుతూ పనికిమాలిన ఫ్రీ పథకాలకు ఆకర్షితులవుతున్నారు. ఇన్ని ఫ్రీ పథకాలు పెడుతూ ప్రజలను మభ్యపెడుతున్నా ఎన్నికల సంఘం ఏ మాత్రం పట్టించుకోకపోవడం శోచనీయం.

**- వి.సరళ, చెన్నై.**

# ఏకపక్షంగా స్టాండింగ్



స్టాండింగ్ కమిటి ఛైర్మెన్‌లతో మేయర్ అబ్దుల్ అజీజ్

నెల్లూరు నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీల ఎన్నిక ఏక పక్షంగా ముగిసింది. తెలుగుదేశంపార్టీ అధికార దుర్వినియోగాన్ని నిరసిస్తూ వైకాపా సభ్యులు ఎన్నికను బాయ్‌కాట్ చేయగా తెలుగుదేశంపార్టీ నుండి పోటీ చేసిన ఐదుమంది సభ్యులు ఏకపక్షంగా ఎన్నికయ్యారు. మొత్తం ఐదు స్టాండింగ్ కమిటీ ఛైర్మెన్‌ల పదవులను తెలుగుదేశం నాయకులు వర్గానికి ఒకటి చొప్పున పంచుకోవడం విశేషం. ఆనం వర్గానికి చెందిన కిన్నెర ప్రసాద్, సోమిరెడ్డి వర్గం నుండి దాసరి రాజేష్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వర్గానికి చెందిన అంచూరు జానకి, ఆదాల వర్గం నుండి దొడ్డపనేని రాజానాయుడు, మేయర్ అజీజ్ వర్గం నుండి షేక్ వహీదలు స్టాండింగ్ కమిటీ ఛైర్మెన్‌లుగా ఎన్నికయ్యారు.

నగర పాలక సంస్థ తెలుగుదేశం కార్పొరేటర్లలో ఐదు వర్గాలున్నాయి. ఎక్కువమందికి మేయర్ అజీజ్ అంటే పడడం లేదు. అజీజ్ మీద అసంతృప్తితో మొత్తం ఐదు పదవులకు 13మంది కార్పొరేటర్లు నామినేషన్లు వేశారు. వైకాపా నుండి కూడా ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్‌లు వేశారు. ఇక్కడ మేయర్ గందరగోళంలో పడ్డాడు. పార్టీలోని తన వ్యతిరేక వర్గీయులు, వైకాపా కార్పొరేటర్లు కలిసి తన మనుషులను ఓడిస్తారేమోననే భయం పట్టుకుంది. అప్పటికప్పుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్రలతో మంతనాలు జరిపారు. ఎన్నికల ముందురోజైన 20వ తేదీ నెల్లూరులోని ఓ హోటల్‌లో ముఖ్య నాయకులతో పాటు కార్పొరేటర్లతో రాజీ చర్చలు జరిపారు. ఇక్కడే ఐదు పదవులను ఐదు వర్గాలకు పంచే ఒప్పందం జరిగింది. అయినా కూడా మేయర్ ఎక్కడ క్రాస్ ఓటింగ్ జరుగుతుందోననే భయంతో 21వ తేదీ బహిరంగ బ్యాలెట్ ద్వారా బ్యాలెట్‌లపై సీరియల్ నెంబర్లు ముద్రించి ఓటింగ్ నిర్వహించారు. దీనిద్వారా ఏ కార్పొరేటర్ ఎవరికి ఓటు వేసారనేది తెలిసిపోతుంది. గతంలో ఎప్పుడు కూడా ఇలా ఓటింగ్ నిర్వహించలేదు. దీనిని నిరసిస్తూ వైసిపి ఎన్నికలను బహిష్కరించగా తెలుగుదేశం వాళ్ళు మాత్రం తమ పని తాము కానిచ్చుకున్నారు.

# మంత్రివర్యా.. మరిచారా?



**దాహం వేసినప్పుడు బావి తవ్వు కోవడం ప్రభుత్వాలకు అలవాటై పోతుంది. అయితే ఆ విధంగా తవ్వినా ఫర్వాలేదు. కాని తవ్వుతున్నట్లు నటిస్తుం డడంతోనే వచ్చిన ఇబ్బందంతా!**

గత యేడాది నవంబర్‌లో వచ్చిన వర్షాలు, వరదలకు నెల్లూరులోని పలు ప్రాంతాలు మునిగిపోవడం చూసాము. కొన్ని కాలనీలలో అయితే నాలుగురోజుల దాకా తెప్పల్లో వెళ్లి బాధితులకు ఆహారపొట్లాలు, మంచినీళ్లు అందించాల్సి వచ్చింది. ఇంత తీవ్ర పరిస్థితులు తలెత్తడానికి కారణం నగరంలో పంట కాలువల ఆక్రమణలేనని అప్పుడు అధికారులు గుర్తించారు. పంటకాలువల ఆక్రమణలపై అప్పటికప్పుడు 200 మంది దాకా రెవెన్యూ సిబ్బందిని దించి సర్వేలు చేయించారు. పంటకాలువల ఆక్రమణలకు సంబంధించి నగరంలో మార్కింగ్ కూడా ఇచ్చారు. ఈ మార్కింగ్ ప్రకారం ఆక్రమణలు తొలగిస్తే వేలాది ఇళ్లతో పాటు హోటళ్లు, పలు వాణిజ్య భవనాలు కూడా పోతాయి. పెద్దపెద్ద కాంప్లెక్స్‌ల సంగతి పక్కనపెడితే, బీద, బిక్కి బాధితులకు 5వేల ఇళ్లు కట్టిస్తామని, ఆరునూరైనా ఆక్రమణలు తొలగించి తీరుతామని ఆరోజు మంత్రి నారాయణ గట్టిగానే చెప్పాడు. ఆరోజు మంత్రులు, అధికారుల ప్రకటనలు ఎలా వున్నాయంటే ఒకటి, రెండు వారాల్లో ఆక్రమణల తొలగింపు పూర్తవుతుందన్నట్లు మాట్లాడారు.

ఆ తర్వాత ఆక్రమణల తొలగింపు రాజకీయ రంగు పులుముకుంది. బాధితులకు నీడ కల్పించిన తర్వాతే ఆక్రమణలు తొలగించాలంటూ నెల్లూరు నగర, గ్రామీణ ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టారు. దీంతో పాటు మంత్రికి చెందిన నారాయణ మెడికల్ కాలేజీ ప్రాంగణమే పంట కాలువను ఆక్రమించి కట్టారనే వివాదం తలెత్తింది. దీంతో అసలు ఆక్రమణల తొలగింపు ఊసే లేకుండా పోయింది. మళ్లీ ఇది గుర్తుకు రావాలంటే నవంబర్ వర్షాలు రావాల్సిందే!

### టోల్ ఉంటుంది...

# ప్లేస్ మారుతుంది!




నెల్లూరు సమీపంలో కనుపర్తిపాడు క్రాస్ వద్ద జాతీయ రహదారిపై పెట్టదలచిన టోల్‌గేట్‌పై తీవ్ర స్థాయిలో ఆందోళనలు తలెత్తడం తెలిసిందే! టోల్‌గేటుకు వ్యతిరేకంగా చేసిన ఈ ఉద్యమంలో నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చురుకైన పాత్రను పోషించాడు. ఆయనే చొరవ తీసుకుని అన్ని పార్టీల నాయకులను ఒక వేదిక మీదకు తీసుకొచ్చారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో టోల్‌గేటు వ్యతిరేక ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. ఇక్కడ టోల్‌గేటు పెడితే నగరంలో ట్రాఫిక్ పెరగడంతో పాటు భారీ వాహనాలు కూడా నగరంలోకి వచ్చే ప్రమాదముంది. దీనికితోడు రూరల్‌లో అనేక గ్రామాల ప్రజలకు ఇది తలనొప్పిగా మారే అవకాశముంది. అందుకే ఈ టోల్‌గేటుపై కోటంరెడ్డి పట్టువిడవకుండా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాడు. అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలు ఫలితమిచ్చేటట్లే కనిపిస్తున్నాయి. టోల్‌గేటు ఆందోళనల అంశం కేంద్ర రవాణా మంత్రి నితిన్‌గడ్కరీ దాకా వెళ్లినట్లు తెలుస్తోంది.

ఇంత వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో టోల్‌గేటును నెల్లూరు సమీపంలో కాకుండా కోవూరు - నార్త్‌రాజుపాలెం మధ్యలో పెట్టే అవకాశాలపై ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. నెల్లూరు నుండి కావలికి 56కిలోమీటర్ల దూరం వుంది. కావలి దగ్గర ఒక టోల్‌గేటు వుంది. 36కిలోమీటర్ల లోపు టోల్‌గేటు పెట్టకూడదు. కోవూరు, రాజుపాలెం మధ్య టోల్‌గేటు పెడితే నిబంధనల ప్రకారం లెక్క కూడా సరిపోతుంది.

# సివిల్స్ ర్యాంకర్‌కు అభినందనల వెల్లువ





సివిల్స్ ఫలితాల్లో 158వ ర్యాంకు సాధించిన నెల్లూరుకు చెందిన సాయి చైతన్యను సోమవారం నెల్లూరుజిల్లా ఎస్పీ విశాల్‌గున్ని అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సాయిచైతన్యతో ఎస్పీ కొంతసేపు మాట్లాడారు. సివిల్స్‌లో విజయం సాధించి జిల్లాతో పాటు కుటుంబసభ్యులకు కీర్తిని తీసుకురావడం అభినందనీయమన్నారు. త్వరలో డిఓపి అండ్ టి నుండి ఐపిఎస్ ట్రైనింగ్‌కు ఆదేశాలు అందుతాయన్నారు. నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ ఏ విధంగా ఉంటుందో అన్ని విషయాలు గురించి సాయిచైతన్యకు అవగాహన కలిగించారు. శిక్షణ పూర్తయిన తర్వాత ప్రజాసేవలో విజయవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం సాయిచైతన్యకు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయిచైతన్య తండ్రి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

అలాగే, ఈ నెల 21న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వేదాయపాళెంలోని సాయిచైతన్య ఇంటికి వెళ్ళి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. సివిల్స్‌లో మంచి ర్యాంకును సాధించి పుట్టిన వూరుకు, తల్లిదండ్రులకు ఎనలేని గౌరవం తీసుకురావడం ఎంతో అభినందనీయమని ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు. సాయిచైతన్య ఉత్తమ అధికారిగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. సాయి తల్లిదండ్రులను కూడా ఆయన అభినందించారు. సాయిచైతన్య తండ్రి విద్యుత్‌శాఖ డిఇగా పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్సీపి నాయకులు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, సిహెచ్ సాయిసునీల్, విశ్వరూపాచారి, మదన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'నీట్' తప్పనిసరి.. సంతోషకరం

**- ఎమ్మెల్సీ విఠపు**



వైద్య విద్యలో ప్రవేశాల కోసం కేంద్రప్రభుత్వం నీట్ పరీక్షను తప్పనిసరి చేయడం ఎంతో సంతోషకరమని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. నెల్లూరులోని ఆర్‌ఎల్‌రెడ్డి స్మారకభవనంలో మంగళవారం నీట్ పరీక్షపై జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్షను తప్పనిసరి చేయడం వల్ల ఆంధ్ర, తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక తదితర రాష్ట్రాల్లోని ప్రైవేట్ సంస్థల ఆధిపత్యానికి గండికొట్టడంతో పాటు, మంచి పరిజ్ఞానం వున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. నీట్ పరీక్ష ద్వారా వైద్యవిద్య కోర్సును పూర్తిచేసినట్లయితే రోగులకు నిస్వార్థంతో వైద్య సేవలను అందించే పరిస్థితి వస్తుందన్నారు. నీట్ పరీక్షపై విద్యార్థులకు మంచి అవగాహన కల్పించడంతోపాటు, అవసరమైన పరీక్ష పుస్తకాలను వారికి అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. సింగపూర్, జపాన్ వంటి దేశాల్లో అనుసరిస్తున్న విద్యావిధానాలను కూడా అధ్యయనం చేసి, అలాంటి విధానాలను ఇక్కడ కూడా అమలు చేస్తే బావుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి జెవివి నాయకుడు డాక్టర్ రమణయ్య అధ్యక్షత వహించగా, చర్చావేదికలో ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసులు, సర్వశిక్ష అభియాన్ ఏఎంఓ హమీద్ రత్నం, నారాయణ, విశ్వసాయి విద్యాసంస్థల ప్రతినిధులు రత్నం నాయుడు, లక్ష్మీప్రసాద్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# 5 దాటితే రిజిస్ట్రేషన్లు బంద్

నెల్లూరుజిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా అర్ధరాత్రి దాకా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. తప్పుడు, మోసపూరిత రిజిస్ట్రేషన్లు చాలావరకు రాత్రి సమయాల్లోనే జరుగుతున్నాయనే ఫిర్యాదులు ప్రభుత్వానికి వస్తున్నాయి. రాత్రయినా దస్తావేజులు వస్తూ ఉండటంపై సబ్‌రిజిస్ట్రార్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం 5గంటల తర్వాత సెంట్రల్ సర్వర్‌ను నిలిపి వేయడం ద్వారా వాటిని కట్టడి చేయాలని కోరుతూ గతంలో సబ్‌రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్ల శాఖ ఐజికి మొరపెట్టుకున్నారు. ఈ విషయంపై స్పందించిన ప్రభుత్వం జూన్ 1వ తేదీ నుండి సాయంత్రం 5గంటల తర్వాత వచ్చే ఏ దస్తావేజును రిజిస్ట్రేషన్ కోసం స్వీకరించరాదని ఆదేశాలు జారీ చేసిందని సమాచారం.



# నెల్లూరు కబుర్లు

## తిరుపతికి నెల్లూరు నేతలు

ఈ నెల 27, 28 మరియు 29వ తేదీలలో తిరుపతిలో తెలుగుదేశంపార్టీ మహానాడు సభలు జరుగనున్నాయి. మహానాడు సభా ఏర్పాట్లలో నెల్లూరుకు చెందిన పలు వ్యాపార సంస్థలు కూడా పాలు పంచుకున్నాయి. మహానాడు బందోబస్తుకు నెల్లూరుజిల్లా పోలీసులను కూడా భారీగానే తరలించారు. ఇక జిల్లాలోని తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులతో పాటు కార్యకర్తలు కూడా భారీగా మహానాడుకు వెళ్లనున్నారు. ఈమేరకు నియోజకవర్గాలవారీగా ఏర్పాట్లు చూసుకుంటున్నారు.

## ఆక్రమణల తొలగింపుకు శ్రీకారం

నెల్లూరు నగరంలో ఆక్రమణల తొలగింపు మళ్లీ ప్రారంభమైంది. సోమవారం నుంచి పలు ఆక్రమణలు తొలగిస్తున్నారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి విఆర్‌సి సెంటర్ వరకు ఒకవైపు ముందుకువచ్చిన షాపులను, పందిళ్ళు, బోర్డులను తొలగించారు. నగరంలోని ప్రధానమైన ప్రాంతాలు, కూడళ్ళలో ట్రాఫిక్ సమస్య అధికంగా వుండడంతో కార్పొరేషన్ అధికారులు ఈ ఆక్రమణల తొలగింపును ప్రారంభించారు. ఇదేవిధంగా, నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ నుంచి ఆర్టీసి బస్టాండ్ వరకు మొదటివిడతగా ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రెండో విడతలో ఆర్టీసి బస్టాండ్ వద్ద నుంచి కెవిఆర్ పెట్రోల్‌బంక్, దర్గామిట్ట ప్రాంతాల మీదుగా అయ్యప్పగుడి వరకు వున్న ఆక్రమణలను తొలగించనున్నారు. ఈ ఆక్రమణల తొలగింపుతో ఆక్రమణలదారులు బెంబేలెత్తుతున్నారు.

## భావితరాల శ్రేయస్సుకే ఇంకుడుగుంతలు


ఇటుకలను అందిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి

భావితరాల శ్రేయస్సుకు ఇంకుడు గుంతలు అవసరమని, శాస్త్రీయ పద్ధతుల్లో ఇంకుడుగుంతలను ఏర్పాటు చేయాలని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు నగరం 37వ డివిజన్ పరిధిలోని క్రాంతినగర్‌లో ఇంకుడుగుంతలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ నెల్లూరుజిల్లా వాసి ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ జగదీష్ ఇంకుడుగుంతలపై పరిశోధనలు చేశారని, వీటి ఏర్పాటుకు ముందు ఆయన సలహాలు తీసుకోవాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ఇంకుడుగుంతల ఏర్పాటుకు తోడ్పడాలని కోరారు. 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, మాగుంట శరత్ చంద్రారెడ్డి, మాదాలబాబు తదితరులు పాల్గొన్నారు.

## చైల్డ్ ఆశ్రమంలో అన్నదానం



నెల్లూరు నగరం గొల్లపాలెం చైల్డ్ ఆశ్రమంలో ఆదివారం నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అక్కిరెడ్డి వెంకటేష్ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు అక్కిరెడ్డి శ్రీకాంత్ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు కోరెం ప్రవీణ్‌కుమార్, సభ్యులు వెంకటేశ్వర్‌రావు, గాలి శివ, వినోద్, సతీష్, నవీన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్‌కు నివాళి



ఈ నెల 21న మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని నెల్లూరు లోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వద్ద వున్న రాజీవ్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సివి శేషారెడ్డి, నాయకులు చెంచల బాబు యాదవ్, చేవూరి దేవకుమార్‌రెడ్డి, ఎన్ఎస్‌యుఐ నాయకులు కేశవనారాయణ, ఆసిఫ్ బాషా, అనూరాధ, రాజేశ్వరి, శివాచారి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపార ప్రకటనలా? హర్రర్ సినిమా ట్రైలర్సా!

ఏ వ్యాపార, విద్యా, వాణిజ్య సంస్థలైనా వాణిజ్య ప్రకటనలు ఇచ్చుకోవాల్సిందే! అయితే అవి ప్రజలను ఆకర్షించేటట్లుం డాలిగాని భయపెట్టేటట్లుండకూడదు. నెల్లూరులోని ఎస్2 సినిమాస్‌లో ఇంటర్వెల్ మధ్యలో వస్తున్న కొన్ని విద్యాసంస్థల ప్రకటనలు చూస్తుంటే విరక్తి కలుగుతోంది. అదేదో 'భూతాలదీవి', 'దెయ్యాలకోట' వంటి హర్రర్ సినిమాల ట్రైలర్స్ చూస్తున్నట్లుగా వుంది. భీకరమైన వాయిస్‌తో, అరివీరభయంకర శబ్దాలతో, హర్రర్ సినిమాలలో ఉండే బ్యాక్‌గ్రౌండ్‌తో వస్తున్న ఈ ప్రకటనలు ప్రేక్షకుల చెవులకు చిల్లులు పెడుతున్నాయి. మొన్న ఎస్2లో బ్రహ్మోత్సవం సినిమా ఇంటర్వెల్‌లో రెండు విద్యాసంస్థల ప్రకటనలు చూసి ప్రేక్షకులకు పిచ్చెక్కినంత పనయ్యింది. అసలే ఆ సినిమా ఫస్ట్‌ఆఫ్‌కు ప్రేక్షకులకు తల తిరుగుతుంటుంది. ఆ తర్వాత ఈ ప్రకటనల దెబ్బకు ఇంకొంచెం బేజారుగా వుంటుంది. విద్యాసంస్థలు తమ ర్యాంకులను ప్రకటించుకునే విధానం ప్రకటనల రూపంలో సున్నితంగా వుండాలేగాని ఇలా చెవులకు మోతెక్కించేలా ఉండకూడదు.

### ఏపిఆర్‌జెసి ఫలితాలలో

## సత్తాచాటిన నేతాజీ!


ఎస్‌విఎస్ గోకుల్


పి.గిరిధర్

ఏపిఆర్‌జెసి ఎంట్రన్స్ ఫలితాలలో ఎప్పటిలాగే నెల్లూరులోని శ్రీ నేతాజీ(ఎంఎన్ఆర్) పైలట్ హైస్కూల్ అండ్ కోచింగ్ సెంటర్ మంచి ర్యాంకులు సాధించింది. ఈ స్కూల్‌కు చెందిన ఎస్‌విఎస్ గోకుల్ ఎంపిసి విభాగంలో 150 మార్కులకు గాను 146మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి రెండో స్థానాన్ని, బైపిసిలో పి.గిరిధర్ 150మార్కులకు గాను 132మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి 52వ ర్యాంకును సాధించారు. ఈ స్కూలు నుండి ఎంపిసిలో జిల్లా స్థాయిలో 14, 16, 17, 24, 26, 28 ర్యాంకులు, బైపిసిలో జిల్లా స్థాయిలో 3, 5, 9, 10, 11, 12, 13, 24, 28, 40, 43, 52 ర్యాంకులను, ఎంఇసిలో జిల్లా స్థాయి 25, 42, 44, 52ర్యాంకులను, సిఇసిలో జిల్లా స్థాయి 9, 11, 15, 33, 39, 49, 53ర్యాంకులతో 31మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి ఏపిఆర్‌జెసి కళాశాలల్లో ప్రవేశానికి అర్హత సాధించారని స్కూల్ కరస్పాండెంట్ యం.వి.సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## పుస్తకాల ఆవిష్కరణ


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు, నెరసం సభ్యులు

నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరు టౌన్ హాలు రీడింగ్ రూములో ప్రముఖ రచయిత, గాయకులు ఉక్యం రమణయ్య రచించిన "జ్ఞాన ప్రసూనాలు", "సిపి బ్రౌన్" చరిత్ర పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సభకు అధ్యక్షత వహించిన విశ్రాంత అడిషనల్ ఎస్పీ ఏ.సి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలను ప్రభావితం చేసే సాహిత్యం అవసరమన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ సాహిత్యం యొక్క గొప్పతనాన్ని వివరించారు. విశ్రాంత అధ్యాపకులు డా॥ చీమకుర్తి వెంకటేశ్వరరావు, తెలుగు పండితులు ఆలూరు శిరోమణిశర్మ పుస్తకాలను సమీక్షించారు. నెరసం ప్రధానకార్యదర్శి పాతూరి అన్నపూర్ణ నిర్వహణలో జరిగిన ఈ సభలో కవిసమ్మేళనం జరిగింది. దోనిపర్తి రమణయ్య, కొండవీటి రామకృష్ణలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## టంగుటూరికి నివాళులు


టంగుటూరుకు నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ నాయకులు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 58వ వర్ధంతి సభ నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ సెంటర్‌లోని టంగుటూరి విగ్రహం వద్ద జరిగింది. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమితి అధ్యక్షకార్యదర్శులు ఇసుకపల్లి కామేశ్వర్‌ప్రసాద్, జి.వాసుదేవరావులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకాశంపంతులు జయంతి, వర్ధంతులను అధికారికంగా ప్రకటించినా ప్రభుత్వ పరంగా ఆయన వర్ధంతిరోజు ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించకపోవడం శోచనీయమన్నారు. భవిష్యత్తులో ఆయన జయంతి, వర్ధంతులను ప్రభుత్వ అధికారులు నిర్వహించాలని, అలా నిర్వహించకపోతే అధికారులు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ప్రకాశం పంతులు విగ్రహం వద్దనున్న ఫిష్‌ఫౌంటైన్‌ను తీసివేసి ఆ స్థలంలో మహాకవి తిక్కన విగ్రహాన్ని ప్రతిష్టింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వయంపాకుల శ్రీనివాసులు, రాష్ట్ర అర్చక ఉపాధ్యక్షులు గుడ్లూరు ఫణికుమార్, కనుపర్తి దయాశంకర్, దుద్దుకూరి రమేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బోసిపోయిన కలెక్టరేట్

నెల్లూరులోని కలెక్టరేట్‌లో గత నాలుగు రోజులుగా కళ తప్పింది. అధికారుల సందడి లేదు. జిల్లా కలెక్టర్ ఎం.జానకి ఈ నెల 29వ తేదీ దాకా సెలవులో ఉండడం తెలిసిందే! ఇక జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ విజయవాడలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సుకు వెళ్లడం, డిఆర్‌ఓ సుదర్శన్‌రెడ్డి ఢిల్లీకి వెళ్ళి ఉండడంతో కలెక్టరేట్‌లో సందడి తగ్గింది.

### పూలు, పండ్లు

## కొనేటట్లు లేవు

ఎండల దెబ్బకో, పంటలు లేకనో మార్కెట్‌లో పూలు, పండ్లు కొనలేనంత ధరలు పలుకుతున్నాయి. అసలు మార్కెట్‌లో పండ్లు కూడా తక్కువే ఉంటున్నాయి. ఇది పుచ్చకాయల సీజన్ అయినప్పటికీ పెద్దగా రాలేదు. వచ్చిన కొద్ది కాయలు కూడా అలివికాని ధర పలుకుతున్నాయి. ఇక వేసవి అంటే మామిడిపండ్లు స్పెషల్. ఈ సంవత్సరం మామిడి దిగుబడి తక్కువే! అదీగాక రసాయనాలతో మాగేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించి ఉండడంతో ఆ విధంగా కూడా మామిడి పండ్లు కొంత తగ్గాయి. లేకపోతే ఇదివరకే రోడ్ల మీద గుట్టలు గుట్టలు పోసి అమ్ముతుండేవాళ్లు. మామిడి పండ్లు కిలో 50 రూపాయలపైనే అమ్ముతున్నారు. ఇక పూల రేట్లు కూడా ఎక్కువగానే ఉన్నాయి. పావు కిలో చామంతి, రోజా పూలు 50రూపాయలు లెక్కన అమ్ముతున్నారు.

## తీరిన విద్యార్థుల బెంగ!

ఎంసెట్ మెడికల్ ఫలితాలను ఎట్టకేలకు వెల్లడించడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఏడాది నుండే మెడికల్ కళాశాలలో ప్రవేశాలకు 'నీట్' తప్పనిసరి అని సుప్రీంకోర్టు తీర్పివ్వడంతో ఎంసెట్ రాసిన విద్యార్థులు గందరగోళంలో పడ్డారు. ఓ పక్క ఎంసెట్ రాసి మరోపక్క 'నీట్'కు కూడా సిద్ధమయ్యారు. ఆయా కళాశాలలు 'నీట్' కోచింగ్‌లు కూడా మొదలుపెట్టాయి. అయితే కేంద్రప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తెచ్చి ఈ ఏడాది 'నీట్'ను మినహాయించడంతో విద్యార్థులకు ఊరట లభించింది.

## మళ్ళీ మండుతున్నాయి

వానలతో నాలుగు రోజుల పాటు ఉపశమనం లభించిందనుకుంటే మళ్ళీ ఎండలు అదరగొడుతున్నాయి. సెగగాలుల దెబ్బకు జనం అల్లాడుతున్నారు. ఉదయం సూర్యోదయంతోనే సెగ మొదలవుతోంది. ఉక్కపోతకు చెమటలు లీటర్ల కొద్దీ కారుతున్నాయి. రోవాను తుఫాన్‌తో లభించిన చల్లదనాన్ని రోహిణి కార్తె మింగేసింది.

# కమలంపై కన్నెర్ర

## ❍ నెల్లూరు మినీమహానాడులో మేజర్ సబ్జెక్ట్ బీజేపీపై విమర్శలే!



ఈ నెల 23వ తేదీన నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో జిల్లా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మినీమహానాడును నిర్వహించారు. సభా ప్రాంగణాన్ని పచ్చని తోరణాలతో, పార్టీ జెండాలతో అలంకరించి పసుపుమయం చేశారు. 2014లో పార్టీ అధికారంలోకి వచ్చాక జిల్లా తెలుగుదేశంపార్టీ నిర్వహించిన తొలి మహానాడు కావడంతో అన్ని నియోజకవర్గాల నుండి కూడా కార్యకర్తలు ఒక మోస్తరుగా తరలివచ్చారు. ఇక జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సిద్ధా రాఘవరావు, జిల్లా మంత్రి పి.నారాయణ, పార్టీ పరిశీలకులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, తెలుగుదేశంపార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పరసా రత్నం, బల్లి దుర్గాప్రసాదరావు, కంభం విజయరామిరెడ్డి, టి.రమేష్ రెడ్డి, బీద మస్తాన్‌రావు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, జిల్లా తెలుగుదేశం నాయకులు వేనాటి రామచంద్రారెడ్డి, టి.అనూరాధ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, జ్యోత్స్నలత, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, జి.కన్నబాబు, మేయర్ అజీజ్, డాక్టర్ జడ్.శివప్రసాద్, యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, దేశాయి శెట్టి హనుమంతరావు, ఆనం జయకుమార్‌రెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, చేవూరు విజయమోహన్‌రెడ్డి, శింగంశెట్టి రవిచంద్ర, కాకర్ల తిరుమలనాయుడు, పొత్తూరి శైలజ తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సభలో ప్రసంగించిన నాయకులు ఎక్కువ మంది ముఖ్యమంత్రి చంద్రబాబు 18 గంటలు కష్టపడుతున్నారని, ఆయన లాంటి సీఎం దొరకడం మన అదృష్టమని చెప్పడానికి పోటీపడ్డారు. ఇక ఈ సభలో నాయకులు ప్రధానంగా బీజేపీపై తమ విమర్శలను ఎక్కుపెట్టారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా రాకపోవడానికి ప్రధాన కారణం బీజేపీయేనంటూ తిట్టిపెట్టారు. విభజన బిల్లులో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ బీజేపీ నెరవేర్చడం లేదంటూ మండిపడ్డారు. మొత్తానికి బీజేపీని తిట్టడానికే నెల్లూరు మినీమహానాడును ఘనంగా నిర్వహించినట్లుంది.

# ఇచ్చింది తక్కువ... చూపింది ఎక్కువ!



## • జడ్పీ స్టాడింగ్ కమిటీలో ఛైర్మెన్ బొమ్మిరెడ్డి ఆగ్రహం

ఈనెల 24వతేదీన నెల్లూరు జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటి సమావేశం వివిధ అంశాలపై రసవత్తరంగా జరిగింది. ముఖ్యంగా అధికారులను కేంద్రంగా చేసుకుని జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, సభ్యులు, అధికారులను పలు సమస్యలపై నిలదీశాడు. జిల్లా వ్యాప్తంగా 12,466మంది రైతులకు ఆయిల్ ఇంజన్లు, ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాల కోసం 11.64కోట్లు ఖర్చుపెట్టినట్లు లెక్కలో రాసారని, వాటి వివరాలను తమకు అందజేస్తే అసలు ఏ స్థాయిలో అవినీతి జరిగిందో తాను తేలుస్తానని జడ్పీ ఛైర్మెన్ ఆగ్రహంతో చెప్పాడు. కొడవలూరు, కలువాయి జడ్పీటీసీలు శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డిలు ఈ విషయమై అధికారులను తూర్పారబట్టారు. జిల్లాలోని ఎస్టీ మత్స్యకారులకు సైకిళ్లు, వలల కోసం జడ్పీ నుండి నిధులు మంజూరు చేస్తే వాటిని కూడా దారి మళ్లించారని బొమ్మిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల దాకా నాలుగు అంశాలపై స్టాండింగ్ కమిటి సమావేశాలు జరుగగా సభ్యులు అధికారులపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతూ సమస్యలను ఏకరువు పెట్టడంతో బయట సెగలకు సమావేశాలు ఇంకా సెగ కక్కాయి.

# నిబంధనలు ఉల్లంఘిస్తే 'ఈ' కొరడా!



ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఇక ముందు గట్టి చర్యలు తప్పవని ఎస్పీ విశాల్‌గున్ని హెచ్చరిస్తున్నాడు. 24వ తేదీ ఆయన తన ఛాంబర్‌లో విలేకరులకు ఈ విషయాన్ని చెప్పాడు. నెల్లూరు జిల్లాలోని వాహనాల నెంబర్లు, యజమానుల వివరాల డేటా అంతా సేకరించాం. నిబంధనలు ఉల్లంఘించినా, తగిన పత్రాలు లేకపోయినా వాహనదారుడు ఈ-చలానాతో తన వాహనంతో పాటే మీ సేవా కేంద్రానికి వెళ్లి జరిమానా కట్టాలి. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్, బండి రిజిస్ట్రేషన్ కాపీ, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, పొల్యూషన్, ఆధార్‌కార్డులను కలిగి వుండాలి. తాగి బండ్లు నడపడం, త్రిబుల్ రైడింగ్, విపరీత వేగం, రోడ్లపై విన్యాసాలు చేసేవాళ్లకు జరిమానాలు విధించడంతో పాటు కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించాడు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు





## గూడూరు డివిజన్ వార్తలు

# యాత్రికులను బురిడీ కొట్టించాడు

గూడూరు పట్టణానికి చెందిన పలువురు యాత్రికులు ట్రావెల్ బస్సు నిర్వాహకుడు శివకుమార్ అలియాస్ శివయ్యపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణవాసులు 45మందితో కలసి ఈ నెల 1వ తేదీ గూడూరు నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు యాత్రికులు బయలుదేరారు. మార్గంమధ్యలో విజయవాడ వద్ద యాత్రికుల నుంచి రూ.5వేలు చొప్పున వసూళ్లు చేశాడు. ఇలా దాదాపు రూ.2లక్షలు సేకరించుకొన్నాడు. విజయవాడలో యాత్రికులు కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్లారు. అంతకముందు బస్సు ఆయిల్, ఇతర ఖర్చుల కోసం రూ.20వేలు ఇచ్చాడు. అప్పటి నుంచి కనిపించక పోవడంతో యాత్రికులు ఆందోళనకు గురయ్యారు. రోజంతా బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీశారు. కొందరి చొరవతో గూడూరుకు చేరుకున్నారు. పట్టణానికి చెందిన వజ్జా శివకుమార్‌రెడ్డి మరి కొందరు యాత్రికులు పట్టణ ఎస్సై దశరథ రామారావుకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.



బస్సు నిర్వాహకుడుపై ఎస్సైకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

# క్రీడల ద్వారా స్నేహభావం



క్రీడాకారుల దుస్తులను పంపిణీ చేస్తున్న పనబాక కృష్ణయ్య

క్రీడల ద్వారా యువతలో స్నేహభావం పెరుగుతుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య తెలిపారు. గూడూరు మండలంలోని చెన్నూరులో జాకబ్ మెమోరియల్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. తొలుత క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసి పోటీలు నిర్వహించారు. గూడూరు మండలంలోని నెల్లటూరు, తిప్పవరప్పాడు, కామాక్షినగర్, మంగళపూరు, చెన్నూరు తదితర ప్రాంతాలకు చెందిన 10జట్లు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మెన్ బాబురెడ్డి, నాయకులు ముత్యాలయ్య, కల్లూరు రవి, ముత్తూజా తదితరులు పాల్గొన్నారు.

## యాదవ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



మయూరి శ్యాంయాదవ్

గూడూరు నియోజకవర్గంలో పదో తరగతి ఫలితాల్లో 8.3పైన జీపీఏ సాధించిన యాదవ విద్యార్థులకు త్వరలో నెల్లూరు టౌన్‌హాల్‌లో ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు శ్రీ కృష్ణ సేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. యాదవ విద్యార్థులు బాగా చదువుకోవాలనే ఉద్దేశ్యంతో వారిని ప్రోత్సహించేందుకు యాదవ ఎంప్లాయిస్, ప్రొఫెషినల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ బహుమతులు అందిస్తున్నామని ఆయన 'లాయర్'కు తెలిపారు.

## మహిళలకు చెక్కుల పంపిణీ

గూడూరు పట్టణంలోని యూఎఫ్ డబ్ల్యూలో జరుగుతున్న కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించుకొన్న మహిళలకు సోమవారం ఉపవైద్యాధికారి ఈదూరు సుధాకర్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వాటిని అందరూ సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు. గ్రామీణులకు ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వ ఆరోగ్య పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, కనకరత్నం, భాషా తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం నాయకుల నిరసన



భారతీయ జనతా పార్టీ నాయకులు సిపిఎం కేంద్ర కార్యాలయంపై దాడులకు దిగడం అమానుషమని ఆ పార్టీ డివిజన్ కమిటీ సభ్యుడు శివకుమార్ తెలిపాడు. దీనికి వ్యతిరేకంగా పట్టణంలోని గడియారపు స్థంభం వద్ద సోమవారం పార్టీ నాయకులు నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ఆర్‌ఎస్ఎస్, భారతీయ జనతాపార్టీ మూకలు రాజకీయ పార్టీల కార్యకర్తలపై దాడులు చేయడం తగదన్నారు. అధికారంలో ఉన్నామనే ఇలాంటి పనులకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి హేయమైన చర్యలకు పాల్పడితే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి యాదగిరి, కేశవరావు, రామిరెడ్డి, రమణయ్య, శివకుమార్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ నాటిక 'పంపకాలు'



'తలుపు చప్పుడు' నాటికలో ఓ సన్నివేశం

సింహపురి ఆర్ట్ మూమెంట్స్ చతుర్ద వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నెల్లూరులోని టౌన్‌హాలులో ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించారు. చివరిరోజు ఆదివారం విజేతలను ప్రకటించారు. ఉత్తమ ప్రదర్శనగా గోవాడ షుగర్సు లలిత సాయిశ్రీ క్రియేషన్స్ వారి "పంపకాలు" నాటిక నిలిచింది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా ఒంగోలు జనచైతన్య వారి 'చేతిరాత', ఉత్తమ తృతీయ ప్రదర్శనగా చిలకలూరిపేట అంజనా రాథోడ్స్ థియేటర్స్ వారి 'సప్తపది' నాటకాలు ఎంపికయ్యాయి. గెలుపొందిన నాటికలకు బహుమతుల క్రింద రూ.5వేలు, రూ.3వేలు, వెయ్యి రూపాయలు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఉత్తమ రచన సప్తపది నాటక రచయిత తాళాబత్తుల వెంకటేశ్వరరావు, ఉత్తమ దర్శకత్వం 'పంపకాలు' నాటక దర్శకులు జె.సుబ్రహ్మణ్య సతీష్‌లు అందుకున్నారు. ఉత్తమ నటుడుగా 'పంపకాలు' నాటికలోని ప్రభాకర్ పాత్రధారి వి.వరప్రసాద్, ఉత్తమ నటిగా పంపకాలు నాటికలో తులశమ్మ పాత్రధారి సురభి ప్రభావతి బహుమతులు అందుకున్నారు. ఉత్తమ క్యారెక్టర్ యాక్టర్‌గా చేతిరాత నాటికలో వెంకటేశ్వర్లు పాత్రధారి ఎన్.శంకర్, ఉత్తమ హాస్యనటుడుగా 'అంతా మన మంచికే' నాటికలో రంగడి పాత్రధారి వరికూటి శివప్రసాద్, ఉత్తమ విలన్‌గా చేతిరాత నాటికలో గోవిందరాజు పాత్రధారి భద్రేశ్వరరావు, ద్వితీయ ఉత్తమ నటుడుగా తలుపు చప్పుడు నాటికలో గౌతమబుద్ధ పాత్రధారి సుధాకర్, ద్వితీయ ఉత్తమ నటిగా సప్తపది నాటికలో శ్వేత పాత్రధారి కుమారి జయలక్ష్మి, ఉత్తమ రంగాలంకరణ లిఖితసాయి క్రియేషన్స్ గోవాడ షుగర్సు వారి పంపకాలు నాటికలు బహుమతులు అందుకున్నాయి.

**జ్యూరీ అవార్డులు:** చిగురించిన వసంతం నాటికలోని జగన్నాథ పాత్రధారి ఎస్‌కె షరీఫ్, వైనాట్ నాటికలో కుసుమ పాత్రధారి లహరి, తలుపుచప్పుడు నాటికలో వెంకట్ పాత్రధారి నిరంజన్, చేతిరాత నాటికలో విశ్వాస్ పాత్రధారి బి.పార్థసారథి... తీశం, కృష్ణమూర్తి పాత్రధారి చిల్లర సుబ్బారావులు అందుకున్నారు. ఈ నాటిక పోటీలకు న్యాయ నిర్ణేతలుగా చిలుకోటి శ్రీనివాసులు, వై.వెంకటేశ్వర్లు, టి.సురేష్ బాబులు వ్యవహరించారు. ముఖ్యఅతిథులు విజేతలకు జ్ఞాపికలను, ప్రతి ప్రదర్శనకు రూ.8వేలు పారితోషికం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముందు బేబి సుమేధ రింగ్‌తో నర్తించిన శాస్త్రీయ నృత్యప్రదర్శన ఆహూతులను సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తింది. సుమేధను సంస్థ సభ్యులు, ముఖ్యఅతిథులు సత్కరించారు.



రింగుతో నృత్యప్రదర్శన చేస్తున్న సుమేధ

## కమనీయం.. శ్రీ నృసింహస్వామి కల్యాణం



నెల్లూరు రూరల్ మండలంలోని శ్రీ నరసింహస్వామి దేవాలయంలో ఈ నెల 21న స్వామివారి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య, మంగళవాయిద్యాల మధ్య, అశేష భక్తజనం చేసిన గోవింద నామస్మరణల మధ్య శ్రీ లక్ష్మీనరసింహస్వామి-ఆదిలక్ష్మి అమ్మవార్ల కళ్యాణం కమనీయంగా.. రమణీయంగా సాగింది. నెల్లూరు నుంచి, రూరల్ మండలంలోని అనేక గ్రామాల నుంచి ఈ ఉత్సవానికి వేలాదిగా భక్తజనులు తరలిరావడంతో నరసింహకొండ కిటకిటలాడింది. ఈ ఉత్సవానికి పల్లంరెడ్డి గోపాలరెడ్డి కుమారులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు అప్పలాచార్యుల పర్యవేక్షణలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పూలంగిసేవ వేడుకలు ఎంతో వైభవంగా జరిగాయి. పూలంగి సేవకు ఉభయకర్తగా హైమావతమ్మ, అనంతరం జరిగిన గజవాహనోత్సవానికి బండి లచ్చారెడ్డి కుమారులు, పల్లంరెడ్డి పట్టాభిరామిరెడ్డి కుమారులు, శ్రీనివాసులురెడ్డి, వాకాటి బ్రదర్స్, బట్టేపాటి సోదరులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఈ సందర్భంగా శివకోటేశ్వరరావు ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరులోని వెంకటేశ్వర నాట్యమండలి వారు ప్రదర్శించిన భక్తచింతామణి తదితర నాటక ప్రదర్శనలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి.

## నరసింహకొండలో భక్తులకు అన్నదానం

నెల్లూరు రూరల్‌లోని శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 21న టిడిపి జిల్లా అధికారప్రతినిధి నూనె మల్లికార్జునయాదవ్ ఆధ్వర్యంలో నరసింహకొండలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి ఆదాల ప్రభాకరరెడ్డి, టిడిపి నాయకులు జయకుమార్‌రెడ్డి, హరిబాబుయాదవ్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఖర్చులు ఎక్కువగా వుండినా ప్రయోజనకరంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి సంతృప్తికరం. అనుకున్న పనులకు అడ్డంకులుండినా ప్రయోజనం సాధిస్తారు. కుటుంబసభ్యులతో సర్దుబాటుచేసికొని పోవలసి వుంటుంది. పెట్టుబడులు, పొదుపు పథకాల మీద దృష్టిపెడతారు. వృత్తి పరంగా స్థిరపడే నిర్ణయాలు తీసుకొనాలి. ఇతరుల విమర్శలను పట్టించుకొనవద్దు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆర్థికాభివృద్ధి అవకాశాలు చేజారిపోవడం, ఆర్థిక ఇబ్బందులు కలగడం ఉంటుంది. ఆదాయం కన్నా ఖర్చు లెక్కువగా ఉంటాయి. సమావేశాలు తీర్మానాలలో సలహాలు ఆమోదింపబడగలవు. వృత్తి ఉద్యోగాలలో గుర్తింపు, సామర్థ్యము బాగుంటుంది. కోర్టు కేసులు వాయిదా పడతాయి. వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. విద్యావకాశాలు బాగుంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

హోల్‌సేల్ వ్యాపారులు, స్టాకిస్టులకు ఆదాయం బాగుంటుంది. చిల్లర వ్యాపారులకు ఆశించినంత రాబడి ఉండదు. కోర్టు వ్యవహారాలు పెండింగ్‌లో ఉంటాయి. స్థిరాస్తుల లావాదేవీలు, పొదుపు పథకాలపై దృష్టి పెడతారు. ఉద్యోగులకు సమర్థత, అదనపు బాధ్యతలు పెరుగుతాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకగలవు. ఉన్నత విద్యావకాశాలు దొరకగలవు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తి జీవనం కలవారికి, ఉపాధి వర్గాలకు ఆదాయం బాగుంటుంది. బంధువర్గంతో సఖ్యత సరిగా ఉండదు. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. మొగమాటాలకు పోయి హామీలు, అప్పులు ఇవ్వవద్దు. ఉద్యోగుల సమర్థతకు ప్రతిఫలం, గుర్తింపు లభిస్తుంది. ఒత్తిళ్ళు, చిక్కులు సర్దుబాటై మానసికంగా స్థిమిత పడతారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 27.5.2016 నుండి
తేది. 2.6.2016 వరకు

ఈ వారం మకర కుంభ మీన మేష రాశులలో చంద్రుడు, మేషంలో బుధుడు, వృషభంలో రవిశుక్రులు, సింహంలో గురురాహువులు, వృశ్చికంలో శనికుజులు కుంభంలో కేతువు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 28 శనివారం సాయంకాలము కర్తరి సమాప్తము.
శుక్ర మౌఢ్యమి జరుగుచున్నది. ముహూర్తములు లేవు.
తేది 31 మంగళవారం హనుమజ్జయంతి.

**వైశాఖ మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 27 | శుక్ర | షష్ఠి | రా॥ గం.4.0వ॥ |
| తేది. 28 | శని | సప్తమి | రా॥ గం.2.44వ॥ |
| తేది. 29 | ఆది | అష్టమి | రా॥ గం.1.0వ॥ |
| తేది. 30 | సోమ | నవమి | రా॥ గం.11.02వ॥ |
| తేది. 31 | మంగళ | దశమి | రా॥ గం.8.47వ॥ |
| తేది. 1 | బుధ | ఏకాదశి | రా॥ గం.6.30వ॥ |
| తేది. 2 | గురు | ద్వాదశి | సా॥ గం.3.58వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆదాయము ఖర్చులు సమానంగా ఉంటాయి. అనుకోని అదనపు ఖర్చులు కూడా ఉండగలవు. అవ సరాలకు ఋణం చేయవలసి కూడా రావచ్చును. కుటుంబవ్యక్తులతో భేదాభిప్రాయాలు రాగలవు. సోదరులు, బిడ్డల వల్ల సమస్యలుండగలవు. అయినా సమర్థతతో సర్దుబాటు చేసికొంటారు. షేర్ మార్కెట్ నిరాశ కలిగించగలదు.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

బంధువర్గంతోను, సోదరులతోను విభేదాలు రాకుండా జాగ్రత్తపడండి. వృత్తివ్యాపారాలు సామాన్యంగా సాగు తాయి. అనుకోని ఖర్చులు పైనబడి ఋణం చేయవలసి వస్తుంది. స్థిరాస్తుల క్రయవిక్రయాలు వాయిదా వేసి కొనండి. తొందరపాటు నిర్ణయాలు, తొందరపాటు ప్రవర్తన ఉండకూడదు. ఆరోగ్యం సరిగా ఉండదు. వారాంతంలో శుభవార్త వింటారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తివ్యాపారాలు వేగవంతమై అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. చిన్నచిన్న కుటుంబ సమస్యలను, ఆర్థిక సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించగలరు. ప్రభుత్వ అనుమతులు, దూరప్రాంత ప్రయాణాలు నిర్ణయం కాగలవు. శుభకార్యాలకు, బిడ్డల ఉన్నత విద్యకు శ్రమి స్తారు. కొత్త పెట్టుబడులు, నూతన వ్యాపారాల ఆలో చనలు రూపం దాల్చవు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆదాయము ఖర్చు సరిపోతుంటుంది. కుటుంబ సౌఖ్యము బాగుంటుంది. వ్యాపారవృద్ధికి, కొత్త పెట్టు బడులకు అవకాశాలుంటాయి. కొత్త కాంట్రాక్టులు, స్థిరాస్తుల లావాదేవీలు అందుబాటు కాగలవు. అనుకున్న పనులు కొద్ది ఇబ్బందులుండినా సక్రమంగా జరుగు తాయి. ఉద్యోగప్రయత్నాలలో కృషి ఫలించగలదు. ఉన్నత విద్యావకాశాలు దొరకగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

చిరువ్యాపారులకు, వృత్తి జీవనం కలవారికి మంచి అభివృద్ధి ఉంటుంది. అనుకున్న పనులు ఆటంకాలు లేకుండా జరుగుతాయి. సమావేశాలు, సేవాకార్యము లందు మీ ప్రాధాన్యం పెరుగుతుంది. ఉద్యోగులకు ప్రమోషన్లు స్థానమార్పులుంటాయి. శుభకార్యాల నిర్ణయ మగు అవకాశమున్నది. ఆర్థిక ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. విలువైన వస్తువులు, ఆభరణాలు సమకూర్చుకొంటారు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

చేపట్టిన పనులకు ఆటంకాలను, సమస్యలను సామ రస్యంగా పరిష్కరించుకొనాలి. ఆర్థికలావాదేవీలు ప్రశాంతంగా సాగుతాయి. వృత్తివ్యాపారాలలో ఆదా యము, అభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది. కొంత టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. అనుకోని ఆర్థిక అవకా శాలు లభించగలవు. సత్కార్యాలకు, బంధుమిత్రులకు సహాయం చేస్తారు. ఆరోగ్యం బాగుంటుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

తొందరపాటు మాటలు, ప్రవర్తన, నిర్ణయాలు చేయకండి. వృత్తి వ్యాపారాలలో ఆదాయము, ఆర్థిక స్థితి సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబంలో అవగాహన లోపం వల్ల ఇబ్బందులుండి సర్దుకుంటాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. శుభవార్తలు వింటారు. విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. సాంకేతిక, వైద్య, శాస్త్ర రంగాల వారికి ప్రోత్సాహకాలు అందగలవు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్థికపరమగు విషయాలలో జాగ్రత్త అవసరం. అనవసర వ్యవహారాలలో కలుగచేసికొనవద్దు. వృత్తి జీవనం కలవారికి, చిన్న వ్యాపారులకు ఆదాయం బాగుంటుంది. కలిసివచ్చిన అవకాశాలను సద్విని యోగం చేసికొనండి. కొత్త పెట్టుబడుల ఆలోచన ప్రస్తుతం మానుకొనండి. రావలసిన బాకీలు కొంతమేరకు లభించడం, కోర్టుకేసులందు అనుకూలత కలదు.

# టెన్ జనపథ్‌లో విజయోత్సవాలు

గల్పిక

అది తమిళనాడు రాజధాని చెన్న పట్నం. సీఎం క్యాంప్ ఆఫీసులో ముఖ్య మంత్రి జయలలిత తన మంత్రులతో సమావేశమై ఉంది. అయితే ఆమె కుర్చీలో కూర్చుని వుండగా, మంత్రు లంతా కూడా మోకాళ్ళ మీద నిలబడి చేతులు జోడించి ఇక చెప్పండి అన్నట్లు న్నారు. జయలలిత వుండి... ఈ ఎన్ని కల్లో మన 'అమ్మ' పథకాలు బాగా పనిచేశాయి. ఈ పథకాలను ఇంకా విస్తరిద్దాం. ఇంకా ఏ ఏ వాటికి 'అమ్మ' పేర్లు పెట్టొచ్చో చెప్పండని అడిగింది. అప్పుడు మంత్రి పన్నీర్ సెల్వం... అమ్మ బాత్‌రూం, అమ్మ చెప్పులు, అమ్మ ఆటో, అమ్మ బస్, అమ్మ రైలు, అమ్మ విమానం, అమ్మ సిగరెట్, అమ్మ రిక్షా, అమ్మ చీరలు, అమ్మ చొక్కాలు, అమ్మ సాంబార్... మనుషులు వాడే ప్రతి వస్తువుకు 'అమ్మ' పేరు పెట్టొచ్చమ్మా అని చెప్పాడు. ఓకే... ఇక అన్నింటికి అమ్మ పేర్లు పెట్టేయ్యండి, ప్రతి వస్తువు మీద అమ్మ పేరు కనపడా లని జయలలిత సూచించింది.

★★★★

అది కేరళ రాజధాని తిరువనంత పురం. సిపిఎం కార్యకర్తలు విజయోత్సవం నిర్వహిస్తున్నారు. అయితే వారి విజ యోత్సవం బాణాసంచా కాలుస్తూనో, స్వీట్లు పంచుతూనో జరగడం లేదు. బీజేపీ కటౌట్‌లను కూలుస్తూ, ఆరెస్సెస్, బీజేపీ వాళ్లను చితకబాదుతూ విజయోత్సవం జరుపుకోసాగారు. అధికారం కోల్పో యిన కాంగ్రెస్‌వాళ్లు కూడా తమ పార్టీ జెండాలు పట్టుకుని ఆ విజయోత్సవంలో పాల్గొన్నారు.

★★★★★

ఇక కోల్‌కత్తాలో తృణమూల్ కాంగ్రెస్ కార్యాలయం వద్ద మమతా బెనర్జీ సాదా సీదాగా విజయోత్సవం నిర్వహించగా, అస్సాంలో గెలిచినందుకు గాను బీజేపీ నాయకులు కూడా తమ పార్టీ కార్యా లయం వద్ద ఒక మోస్తరుగా విజయోత్స వాలు చేసుకున్నారు.

★★★★★

అది ఢిల్లీలోని టెన్ జనపథ్... అక్క డంతా కోలాహలంగా వుంది. కాంగ్రెస్ జెండాలు, బ్యానర్లు, సోనియా, రాహుల్ గాంధీల ఫోటోలతో భారీ ఎత్తున ఫ్లెక్సీలు వెలసివున్నాయి. మన్మోహన్‌సింగ్, ఎ.కె. ఆంటోని, చిదంబరం, గులాంనబీ ఆజాద్, అంబికా సోని, మనీష్‌తివారి, మల్లికార్జున ఖర్గే, పనబాక లక్ష్మి, దిగ్వి జయ్‌సింగ్ వంటి కాంగ్రెస్ పెద్దనాయకు లంతా అక్కడకు చేరుకుంటున్నారు. ప్రతి ఒక్కరి ముఖంలోనూ ఆనందం తాండ విస్తోంది. వి. హెచ్. హనుమంతురావు, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డిలు వచ్చిన నాయ కులందరికీ స్వీట్లు, జ్యూస్‌లు అందిస్తు న్నారు. అక్కడకు వచ్చిన నాయకులందరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ అభినందనలు తెలుపుకుంటున్నారు. పార్టీకి మళ్ళీ మంచిరోజులొచ్చాయని చెప్పుకుంటూ సంబర పడుతున్నారు. వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు రాహుల్ నాయకత్వం వర్థిల్లాలి అంటూ నినాదాలు చేస్తున్నారు. దిగ్విజయ్‌సింగ్ అయితే ఆకాశ మవ్వలు, 10వేల సరాలు కాలుస్తూ తన కొత్త భార్య అమృతాసింగ్‌తో డ్యాన్స్ లేయసాగాడు. టెన్‌జనపథ్ వద్ద కాంగ్రెస్ విజయోత్సవాలు అనేసరికి జాతీయ, అంతర్జాతీయ మీడియా ఛానెల్స్ ప్రత్యేకప్రసార వాహనాలన్నీ కూడా అక్కడకు చేరుకుని అక్కడ జరుగుతున్న కార్యక్రమాన్ని టెలికాస్ట్ చేయసాగాయి. బీజేపీ, అన్నాడిఎంకె, టీఎంసీ వంటి పార్టీల వారు తమ విజయోత్సవాలను ఆపేసి, అసలు కాంగ్రెస్‌వాళ్లు ఎందుకు విజయోత్సవాలు జరుపుకుంటున్నారో అర్థంకాక తమ పార్టీ కార్యాలయంలో టీవీలను ఆన్‌చేసుకుని చూడసాగారు.

టెన్‌జనపథ్ వద్ద కోలాహలం అంత కంతకు పెరగసాగింది. ఏపి నుండి పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి తీసుకెళ్లిన ప్రత్యేక బ్యాండుమేళం, తప్పెట్లను కళా కారులు వాయిస్తూ ఆ విజయోత్సవాలకు మరింత ఊపు తెస్తున్నారు. అంతలో లోపల నుండి సోనియాగాంధీ, రాహుల్‌లు వచ్చారు. వారిని చూడగానే కార్యకర్తలు ఈలలు, చప్పట్లతో మోతె క్కించారు. కొందరు కార్యకర్తలైతే రాహుల్‌ను భుజాలమీదకెత్తుకుని ఊరే గించి ఆనందంతో గెంతులు వేశారు. సందడి సద్దుమణిగాక విజయోత్సవ సభ మొదలైంది. సోనియా, రాహుల్, మన్మో హన్‌సింగ్‌లతో పాటు మరికొందరు అగ్రనేతలు వేదిక మీద కూర్చున్నారు. మొదట అంబికాసోని మాట్లాడుతూ... ఈ విజయం మన రాహుల్‌కే సొంతం... ఆయన ఇమేజ్‌ను చూసే మనకు అన్ని ఓట్లు, అన్ని సీట్లు వచ్చాయి. కాబట్టి ఆయనకు పూర్తి స్థాయిలో పార్టీ బాధ్యతలు అప్పగించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పింది. తర్వాత గులాంనబీ ఆజాద్ మాట్లాడుతూ గత మన యూపిఏ ప్రభుత్వం దేశాన్ని అన్ని విధాలా నానా భండాలం చేసిపెట్టినా ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మనకు ఇన్ని ఓట్లు, ఇన్ని సీట్లు వచ్చాయంటే దానికి కారణం రాహుల్‌కున్న ఇమేజ్ వల్లేనని చెప్పాడు. ఆ తర్వాత ఏ.కె. ఆంటోని, చిదంబరం, మనీష్ తివారి వంటి వాళ్లు కూడా... కుంభకోణాల కాంగ్రెస్ పాలనను ప్రజలు మెచ్చుకున్నారని, కాబట్టి కాంగ్రెస్‌కు ఇన్ని ఓట్లు, ఇన్ని సీట్లు వచ్చాయని చెప్పారు. ఆ సమయంలో సభలో నుండి ఓ కార్యకర్త లేచి... మేడమ్, మనం ఒక్క పుదుచ్చేరిలో తప్ప మిగతా రాష్ట్రాల్లో ఓడిపోయాం కదా, మరి ఈ విజయోత్సవాలను ఎందుకు జరుపుతున్నట్లు అని ప్రశ్నిం చాడు. అప్పుడు సోనియా, మొదట నేనూ నీలాగే అనుకున్నాను. కాని నువ్వు కూడా నాలాగే లాజిక్ మిస్ అయ్యావు. అదేలాగో చూడు అంటూ తన వేలితో స్క్రీన్ గీసి సీన్ ప్లే చేసింది.

★★★★★

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వచ్చేసాయి. టీవీలలో ఫలితాలను చూసి సోనియా, రాహుల్‌గాంధీలు నీరసంగా వున్నారు. రాహుల్‌కైతే అన్నం కూడా తినబుద్ధికాలేదు. అంతలో అక్కడకు ఎంతో ఆనందంగా దిగ్విజయ్‌సింగ్ వచ్చాడు. అరేబియా సముద్రంలో సొంత షిప్‌లు మునిగిపోయినట్లు ముఖాలు వేలాడేసుకుని వున్న సోనియా, రాహుల్‌లను చూసి... ఎందుకు అలా వున్నారు, ఏమైందని అడిగాడు దిగ్విజయ్. అందుకు సోనియా... రిజల్ట్స్ చూళ్లేదా... ఎక్కడా మనకు సీట్లు బాగా రాలేదు అని చెప్పింది. అప్పుడు దిగ్విజయ్... మీ తెలివి తెల్లారినట్లే వుంది. మీరు లాజిక్ మిస్సవుతున్నారు. మనకు ప్రధానపోటీ దారు బీజేపీ... ఐదు రాష్ట్రాల్లో ఆ పార్టీకి, మన పార్టీకి వచ్చిన సీట్లు, ఓట్లు లెక్కే యండి... ఆ పార్టీకంటే మనకే రెండింతలు సీట్లు, ఓట్లు వచ్చాయి. కాబట్టి బీజేపీ మీద మనం గెలిచినట్లు... ముందు మీరు ఆ ముఖాలను కడుక్కుని విజయోత్స వాలకు రెడీకండి, అందర్నీ రమ్మని చెప్పాను... అని చెప్పాడు. సోనియా కూడా, అవును దిగ్విజయ్ నువ్వు చెప్పిన లాజిక్ కరెక్టే... విజయోత్సవాలను ఘనంగా జరిపిద్దాం అంటూ రెడీ కావ డానికి లోపలకు వెళ్లింది.

ఇక్కడితో ఎయిర్‌స్క్రీన్ మీద సీన్‌లు ఆగిపోయాయి. విజయోత్సవాలకు కార ణాన్ని సీన్ ద్వారా వివరించిన సోనియా మున్ముందు పార్టీని ఇదే విధంగా ముం దుకు తీసుకెళ్దామని చెప్పి ముగించింది.

★★★★

టీవీలో ఈ కార్యక్రమాన్నంతా బీజేపీ ఆఫీసులో కూర్చుని నరేంద్ర మోడీ, అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, వెంకయ్య నాయుడు, అరుణ్‌జైట్లీ, మనోహర్ పారి కర్‌లు చూసారు. వెంకయ్య వారితో... దిగ్విజయ్ సింగ్ లాంటి వాళ్లు కాం గ్రెస్‌లో వుంటే త్వరలోనే కాంగ్రెస్ ముక్త భారత్ ఖాయం అని చెప్పడంతో అం దరూ నవ్వుకున్నారు.

# 'నాటా' వేడుకలకు నెల్లూరోళ్ళు





- అమెరికాలో నదియా నృత్య ప్రదర్శన
- సాయి హేమంత్‌కృష్ణ 'నాసికా వేణుగానం'

**అమెరికాలోని డల్లాస్‌లో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు జరిగే నాటా వేడుకల్లో నెల్లూరోళ్ళకు మంచి అవకాశం లభించింది. ఎంతో వేడుకగా సాగే ఈ ఉత్సవాల్లో నాట్యశిరోమణి నదియా నృత్యప్రదర్శనకు ఆహ్వానం అందింది. అదే విధంగా నాసికా వేణుగానంలో సుప్రసిద్ధుడైన సాయిహేమంత్‌కృష్ణకు కూడా ఎంతో అరుదైన అవకాశం లభించింది.**

వేణుగానమే ప్రాణంగా.. అదే లోకంగా వుంటూ, ప్రత్యేకించి నాసిక (ముక్కు)తోనే అద్భుతంగా వేణుగానం వినిపించడంలో సిద్ధహస్తుడైన సాయిహేమంత్‌కృష్ణకు అమెరికాలోని 'నాటా' ఆహ్వానం పలకడం విశేషం. అక్కడ అత్యంత వైభవంగా జరుగుతున్న నాటా ఉత్సవాల్లో సాయిహేమంత్‌కృష్ణ తన నాసికా వేణుగానం వినిపించేందుకు బయలుదేరాడు. కొడవలూరు మండలంలోని నార్త్ రాజుపాళెంకు చెందిన రమేష్‌బాబు- జ్యోతిల కుమారుడైన సాయిహేమంత్ కృష్ణకు చిన్నతనం నుంచి వేణుగానమంటే మహా ఇష్టం. తానుండే పల్లెటూరులో పశువుల కాపరులు వేణుగానం వినిపిస్తున్నా సరే అక్కడికి పరుగెత్తుకువెళ్ళి వినేవాడు. ఆ ఉత్సాహాన్ని చూసిన ఆయన తాత వినుకొండ కోదండరామయ్య అతనికి వేణుగానం నేర్పాడు. అలా వేణుగానం నేర్చుకున్న సాయిహేమంత్‌కృష్ణ అందరిలా పెదవులపై వేణువునుంచుకుని వేణుగానం చేయడమే కాక, ప్రత్యేకించి ముక్కుతోనే వేణుగానం సాధన చేశాడు. ఆ సాధనే అతనికి విశిష్టమైన పేరు తెచ్చింది. ఎంతో అరుదైన, ప్రత్యేకత వున్న ఈ నాసికా వేణుగానం అందరి ప్రశంసలూ అందుకోవడమే కాక, అనేక అవార్డులను కూడా సాధించిపెట్టింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, వండర్ రికార్డ్స్‌లోనూ సాయిహేమంత్‌కృష్ణ నాసికా వేణుగానం ఒక అద్భుతమైన కళగా నమోదైంది. ముక్కుతోనే వేణుగానం వినిపించడం ఎంతో సాహసమైన కళ కూడా. అదేపనిగా సాధన చేస్తే ముక్కులోంచి రక్తం కూడా వస్తుంది. అలా పలుసార్లు జరిగినా, పట్టు వీడకుండా ఆ కళను సాధన చేశాడు సాయి హేమంత్‌కృష్ణ. ఎలాగైనా సరే, గిన్నిస్‌బుక్‌లోకి కూడా ఎక్కాలన్నదే ఆయన ధ్యేయం. కనీసం రెండు గంటలపాటు ఏకధాటిగా నాసికా వేణుగానాన్ని అత్యద్భుతంగా వినిపించడం అతని ప్రత్యేకత. ఈ నేపథ్యంలో, అమెరికాలోని డల్లాస్‌లో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు జరిగే నాటా వేడుకల్లో సాయి హేమంత్‌కృష్ణ వేణుగానానికి ఆహ్వానం పలకడంతో అతని సంతోషం అంతా ఇంతా కాదు. అయితే, పేదరికంలో జన్మించడంతో అమెరికా వెళ్ళేందుకు తగ్గ ఆర్థిక చేయూత లేక సతమతమవుతున్న తరుణంలో, ఆ కళాకారునికి నెల్లూరులోని పలువురు దాతలు సహకరించి, అతను అమెరికా వెళ్ళేందుకు, తద్వారా నాసికా వేణుగానంలో సింహపురి కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేసేందుకు అవసరమైన సాయం చేశారు. అందులో ముఖ్యంగా మురళీకృష్ణ గ్రూప్ ఆఫ్ హోటల్స్ ఎం.డి వీరిశెట్టి హజరత్‌బాబు, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, 'లాయర్' వారపత్రిక సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి, మాడరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి, మయూరి సుబ్బారావు, వీరిశెట్టి సుధాకర్, మండవ సురేష్, డి. హరిబాబు, నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు తగు సాయం అందించారు. అమెరికాలో జరిగే నాటా ఉత్సవాల్లో సాయిహేమంత్‌కృష్ణ తన అద్భుతమైన నాసికా వేణుగానంతో అందరినీ అలరించి కళారంగంలో నెల్లూరు ఖ్యాతిని మరింతగా విఖ్యాతం చేయాలని వారంతా కోరుకుంటున్నారు. విష్ యు ఆల్ ది బెస్ట్.. సాయిహేమంత్!.....

అలాగే, ప్రముఖ నాట్య కళాకారిణి, 'నాట్యశిరోమణి' నదియా డల్లాస్‌లో జరిగే నాటా(ఉత్తర అమెరికా తెలుగు అసోసియేషన్), ఆటా(అమెరికా తెలుగు అసోసియేషన్) వేడుకల్లో పాల్గొని తన అద్భుతమైన నాట్య విన్యాసంతో అందరినీ అలరించనుంది. ఇప్పటికే నదియా దేశవిదేశాల్లో అనేకసార్లు నాట్య ప్రదర్శనలిచ్చి ఎన్నో ప్రశంసలు అందుకుంది కూడా!



## 29న 'నేను... నా నెల్లూరు'

నాటా వేడుకల్లో ఈసారి ప్రత్యేకించి నెల్లూరీయుల ఆత్మీయ సమావేశంలో నెల్లూరు ప్రాభవ వైభవాలను వివరిస్తూ... 'నాటి నెల్లూరు - నేటి నెల్లూరు - రేపటి నెల్లూరు' అనే అంశంపై 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి ప్రసంగించనున్నారు. 29వ తేదీ మధ్యాహ్నం 2.30 నుండి 3.30గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో 'నాటా' ఆహ్వానం మేరకు ఆయన ఈ నెల 22వ తేదీన అమెరికా బయలుదేరి వెళ్ళిన విషయం పాఠకులకు తెలిసిందే!

# రాయలసీమ 'రత్నం'

(మొదటి పేజీ తరువాయి)



హేమలతను అభినందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

### ర్యాంకుల సృష్టికర్త రత్నం:

ఎంసెట్ కోచింగ్‌కు, ర్యాంకుల పరంపరకు ఆద్యుడు, అసాధ్యుడు కె.వి.రత్నం. ఒకనాడు ఎంసెట్ కోచింగ్‌కు నెల్లూరును ఒక హబ్‌గా మలచింది ఆయనే! 1973లోనే నెల్లూరులో రత్నం కోచింగ్ సెంటర్‌ను స్థాపించి, తన సంస్థను ఇంజనీర్లు, డాక్టర్ల ఉత్పత్తి కేంద్రంగా మలిచాడు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నుండి కూడా ఎంసెట్ కోచింగ్ కోసం విద్యార్థులొచ్చి 'రత్నం'లో చేరేవాళ్ళు. ప్రతిఏటా ఎంసెట్ ర్యాంకులు 'రత్నం'వే. ర్యాంకుల అగ్రభాగం వారిదే! అయితే చదువును వ్యాపార వస్తువుగా చూడడం ఇష్టంలేని రత్నం మాష్టారు తన విద్యాసంస్థలను నెల్లూరుజిల్లాను దాటి విస్తరించలేదు. క్రమశిక్షణ, నిజాయితీతో కూడిన విద్యతోనే 'రత్నం' ఎన్నో విద్యా విజయాలను అందుకుంటూ వచ్చింది. కొన్నేళ్ల పాటు ఇంటర్, ఎంసెట్‌కు దూరంగా వున్న రత్నం విద్యా సంస్థలు గత ఏడాది నుండే తిరిగి ఇంటర్మీడియట్, ఎంసెట్‌లలోకి అడుగుపెట్టాయి. ఆరంభంలోనే స్టేట్ ఫస్ట్ ర్యాంకుతో అదరగొట్టింది.

### పేదింటి రత్నం:

మెడికల్‌లో మొదటి ర్యాంకు సాధించిన హేమలతది కర్నూలు. తండ్రి వీరన్న, తల్లి కళావతి. వాళ్లకు ముగ్గురు కూతుళ్లు! వీరన్న బట్టల కొట్టులో చిరుద్యోగి. ఎంసెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకును సాధించాలనే పట్టుదలతో హేమలత తనకు తెలిసిన అధ్యాపకులను విచారించి తన లక్ష్యానికి 'రత్నం విద్యా సంస్థ' సరైనదిగా ఎంచుకుంది. హేమలతలోని చురుకుదనాన్ని, సబ్జెక్ట్‌ల మీద వున్న పట్టును గమనించిన రత్నం యాజమాన్యం, అధ్యాపకులు ఆమెకు పూర్తి సహకారం అందించారు. ఆమెకు కావాల్సిన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచారు. ఆమెకు అర్థమయ్యేరీతిలో సందేహాలను నివృత్తి చేసేవాళ్ళు!

### టాప్ వన్ 'రత్నం' చలవే!

తాను టాప్-10 ర్యాంకుల్లో ఉంటానని భావించానని, టాప్-1 ర్యాంకు వచ్చిందంటే అది రత్నం అధ్యాపక సిబ్బంది తోడ్పాటు వల్లేనని ఈ సందర్భంగా హేమలత 'లాయర్'కు వివరించింది. ప్రతి ఒక్క అధ్యాపకుడు ఎంతో చక్కగా సబ్జెక్టులు చెప్పారు. అన్ని విధాలుగా గైడెన్స్ ఇచ్చారు. వారందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. గత ఏడాదే ఎంసెట్‌లో 245వ ర్యాంకు వచ్చిందని, అయితే వయసు 28రోజులు తక్కువ కావడం వల్ల ప్రవేశం లభించలేదని, ఆ పట్టుదలతోనే ఇప్పుడు చదివి 1వ ర్యాంకు సాధించానన్నారు. ఢిల్లీలోని ఎయిమ్స్ ప్రవేశ పరీక్ష వ్రాసి అందులో చేరాలనుకుంటున్నట్లు హేమలత చెప్పింది. మెదడు, నరాలకు సంబంధించిన వైద్యవిద్యను పూర్తి చేసి, చేతనైనంత వరకు ఆ విభాగంలో పేదలకు వైద్యసహాయం చేయాలన్నది తన జీవిత లక్ష్యంగా ఆమె తెలియజేశారు.

### మనసున్న మాష్టారు:

ఈనాటి కార్పొరేట్ విద్యాసంస్థల్లో డబ్బు విష సంస్కృతి ఏ స్థాయిలో వుందో చూస్తూనే వున్నాం. కాని రత్నం మాష్టారు ఆ సంస్కృతికి చాలా దూరంగా వుంటారు. విద్యార్థులను ఫీజులు కట్టే యంత్రాలుగా కాకుండా విజ్ఞాన వేత్తలుగా చూడడం ఆయన నైజం. తన వద్ద చదువుకోవడానికి వచ్చే విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని సైతం ఆయన నిశితంగా గమనిస్తుంటాడు. ఎంతోమందికి చదువుల పరంగా సాయం చేస్తుంటాడు. హేమలత విషయంలోనూ ఆయన ఎంతో ఉదారంగా వ్యవహరించాడు. వాళ్ల కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఆయన ఆమెకు ఎంసెట్ కోచింగ్‌ను ఉచితంగా ఇవ్వడమే కాదు, ఆమె భవిష్యత్ చదువుల కోసం 5లక్షలను ఆమె పేరుతో బ్యాంకులో డిపాజిట్ చేయించాడు. దీనికి సంబంధించిన పత్రాలను ఫలితాల విడుదల రోజున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా హేమలతకు అందజేశారు. ఇక హేమలత చెల్లెలిని కూడా ఉచితంగా చదివించేందుకు 'రత్నం' మాష్టారు ముందుకు రావడం ఎంతైనా అభినందనీయం.

### అభినందనల వెల్లువ:

మెడికల్‌లో రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకు సాధించిన హేమలతను ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు రాష్ట్ర మంత్రులు కూడా అభినందించారు. ఇక గవర్నర్ నరసింహన్ అయితే ఈ నెల 24వ తేదీన ప్రత్యేకంగా హైదరాబాద్ పిలిపించుకుని ప్రశంసించారు. ఆమెతో పాటు రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం, అధ్యాపకులు కూడా గవర్నర్‌ను కలిసారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే ఎంసెట్ మెడికల్‌లో నెంబర్ వన్ ర్యాంకు మొదలయ్యింది 'రత్నం'తోనే! బహుశా ఆ నెంబర్ వన్ బ్రాండ్ ముగింపు కూడా ఆయన చేతులమీదుగానే జరిగినట్లుంది. ఎందుకంటే వచ్చే ఏడాది నుండి ఇక 'నీట్' కదా! 'నీట్'లోనూ మనం నెంబర్‌వన్ రత్నాలను చూడొచ్చు. హ్యాట్సాఫ్ రత్నం... వెల్‌డన్ హేమలత.



ర్యాంకర్లతో కె.వి.రత్నం

# అపోలోలో అరుదైన శస్త్రచికిత్స




శస్త్ర చికిత్స వివరాలను వెల్లడిస్తున్న అపోలో వైద్యులు

నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో అత్యంత ఆధునిక పరిజ్ఞానంతో మోకాళ్ళ కీళ్ళ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలోనే తొలి సారిగా కంప్యూటర్ నావిగేషన్ పద్ధతిలో జరిగిన ఈ శస్త్రచికిత్స ఎంతో అరుదైనదని ఆసుపత్రి వైద్యులు, ప్రముఖ సర్జన్ మదన్ మోహన్‌రెడ్డి తెలియజేశారు. హరనాథపురంలోని ఆసుపత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నావిగేషన్ వైద్య విధానం దేశంలోని చాలా కొద్ది ఆసుపత్రుల్లోనే వుందని, అందులో అపోలో ఆసుపత్రి ఒకటి కావడం సంతోషకరమన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అందరికీ అందుబాటులో అపోలో ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నామని, ఏదైనా ప్రమాదంలో ఎముకలు విరిగినా, లేదా కీళ్ళు వంకరగా అతుక్కొని నొప్పులు పుడుతున్నా ఇలాంటి నావిగేషన్ వైద్య విధానంతో వాటిని సరిచేయవచ్చుని, ఇప్పటికే ఈ విధానంలో పలు ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపోలో యూనిట్ హెడ్ నవీన్, వైద్యులు వివేకానందరెడ్డి, విజయ్ కిశోర్, మీరావలి, డాక్టర్ శ్వేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆరిపోయిన చిన్నారి దీపం!

- ప్రతి ఒక్కరి కంట కన్నీరు పెట్టించే దయనీయ దృశ్యం
- ఫలించని అవయవదాన ప్రయత్నం

**పేరు సాయి... వయసు ఏడేళ్లు... చదివేది రెండో తరగతి. కాని ఈ చిరు ప్రాయంలోనే నలుగురు వ్యక్తులకు పునర్జన్మనిస్తూ, నాలుగు కుటుంబాల వారిని విషాదం నుండి బయటకు తెచ్చి, తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చినా మరో నలుగురు తల్లులకు గర్భశోకం కలుగకుండా చేయాలని చేసిన ప్రయత్నం విఫలమైంది. అయినా వారి స్ఫూర్తికి ప్రజలు జోహార్లు అర్పిస్తున్నారు.**

అవయవదానం... ప్రజల్లో ఎంత చైతన్యం తెచ్చిందనేందుకు ఈ సంఘటన ఓ ఉదాహరణ. ప్రజలు ఎంత మానవతా దృక్పథంతో ఆలోచిస్తున్నారనేందుకు ఈ సంఘటన ఓ నిదర్శనం. పేద, ధనిక తేడా లేకుండా ప్రజలు తాము విషాదంలో వున్నా మరొకరి బాధను పంచుకోవాలనే సత్సంకల్పంతో అవయవదానానికి ముందుకు రావడం చూస్తుంటే చేతులెత్తి నమస్కరించినా తక్కువేమో! అయితే విధికి కన్నుకుట్టి ఆ సంతృప్తిని కూడా వారికి మిగల్చకుండా ఆపరేషన్ జరిగేలోపే ఆ పసిబిడ్డ గుండెను ఆడడం ఆపేసింది.

వివరాలలోకి వెళితే... విడవలూరు గ్రామానికి చెందిన రవీంద్ర - వెంకట రత్నమ్మ దంపతులు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వీరికి కార్తీక్, అఖిలేష్, సాయి ముగ్గురు కొడుకులు. ఈ నెల 22వ తేదీన రవీంద్ర తన చిన్న కొడుకైన సాయితో ఇంటివెనుకే చెట్టు క్రింద కూర్చుని వున్నాడు. ఆ సమయంలో ముగ్గురు తాగుబోతులు బైక్ మీద వేగంగా వచ్చి అదుపుతప్పి వీరిని ఢీకొట్టారు. ఈ సంఘటనలో రవీంద్ర, సాయిలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని నారాయణ ఆసుపత్రికి తరలించి ఐసియులో ఉంచి చికిత్సనందించారు. అయితే తలకు బలమైన గాయం కావడంతో చిన్నారి సాయి బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యాడు. ఇక ఆ చిన్నారిని బ్రతికించడం కష్టమేనని వైద్యులు నిర్ధారించారు. దీంతో అంత దుఃఖం లోనూ ఆ బాలుడి తల్లి, కుటుంబ సభ్యులు తమ బిడ్డ అవయవాలు దానమిచ్చేందుకు ముందుకొచ్చారు. ఇటీవల మీడియాలో అవయవదానం గురించి పెద్దఎత్తున వార్తలు వస్తున్నాయి. అవయవదానంతో ఎంతమంది పునర్జన్మ పొందుతున్నారో అందరూ తెలుసుకుంటున్నారు. ఈమధ్య సంగం మండలంకు చెందిన సుభాషిణి అనే బాలిక కూడా ప్రమాదంలో గాయపడి బ్రెయిన్‌డెడ్‌కు గురైనప్పుడు వారి కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు రావడం తెలిసిందే! ఈ స్ఫూర్తితోనే సాయి కుటుంబసభ్యులు అవయవదానానికి అంగీకారం తెలిపారు. సాయి కాలేయం, కిడ్నీలు, గుండె, కళ్ళను సేకరించి వివిధ ఆసుపత్రులకు తరలించాలనుకున్నారు. బుధవారం ఈమేరకు నారాయణ ఆసుపత్రిలో ఏర్పాట్లు చేసి అవయవాలను వివిధ ఆసుపత్రులకు తీసుకెళ్ళే అంబులెన్స్‌లను కూడా సిద్ధంగా వుంచారు. అయితే ఆపరేషన్‌కు 20 నిముషాల ముందే సాయి గుండె ఆగిపోవడంతో అవయవదాన ప్రయత్నం ఆగిపోయింది.

## సర్జరీ లేకుండానే స్టంట్

నెల్లూరులోని కిమ్స్ (బొల్లినేని) ఆసుపత్రికి ఇటీవల గుండెజబ్బుతో వచ్చిన ఒక మహిళకు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా చేసి ఆమె ప్రాణాలు కాపాడారు. ఆ వివరాలను ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాసరాజు బుధవారం విలేకరులకు తెలిపారు. వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట గ్రామానికి చెందిన షేక్ ఫాతిమున్నీసా అనే మహిళకు బైపాస్ సర్జరీ లేకుండానే స్టంట్ వేసి చికిత్స చేశామని, అలా చేయడం ఎంతో అరుదైన విషయమని అన్నారు. బైపాస్ సర్జరీ లేకుండా విజయవంతంగా స్టంట్ వేసి చికిత్స అందించిన సంఘటన జిల్లాలో ఇదే ప్రథమమని అన్నారు. గుండె ఎడమభాగానికి రక్తం సరఫరాచేసే కెరొనరీ ధమని మొదటిభాగంలో 90శాతం బ్లాక్ అయినట్లు వైద్యపరీక్షల్లో గుర్తించామని, అయితే బైసాస్ సర్జరీకి ఆమె ఇష్టపడకపోవడంతో, ఎంతో క్లిష్టతరం అయినప్పటికీ స్టంట్ వేసి చికిత్సను విజయవంతంగా చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఇ.డి గిరినాయుడు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జె.రంగారావు తదితరులు డాక్టర్ శ్రీనివాసరాజును అభినందించారు.

## ఘనంగా బుద్ధ జయంతి

నెల్లూరులోని జిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక ఆదిత్య డిగ్రీ కాలేజీలో బుద్ధ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అహింస-శాంతి అనే అంశంపై ప్రముఖ కవి గుర్రాల రమణయ్య మాట్లాడుతూ, బుద్ధుని జీవితాదర్శాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు పాల్గొని బుద్ధ జయంతిని పురస్కరించుకుని తమ కవితలను వినిపించారు. ఆచార్య ఆదిత్య, సిరిమామిళ్ళ కోటేశ్వరరావు, కల్లూరి శేఖర్, బివి నరసింహం, మార్టూరి శ్రీరామప్రసాద్, డి.వేణుగోపాలరెడ్డి, జి.సుభద్రాదేవి, జి. లలిత, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, కొర్రపాటి వెంకటరమణయ్య, ఎస్ దశరథరామిరెడ్డి, పచ్చా పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు. కవి సమ్మేళనం అనంతరం కవులకు నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు.

## దేహసమర్పకుల సమాచారం కోసం 9493912212

పినాకిని దేహసమర్పకుల సంస్థ నిర్వాహకుడుగా నెల్లూరు నేత్ర దాతల సంస్థ, సింహపురి స్వచ్ఛంద రక్తదాతల బృందం కార్యదర్శిగా, పలు సంస్థల్లో కార్యకర్తగా పని చేస్తున్న సామాజిక స్వచ్ఛంద కార్యకర్త తిక్కవరపు సుకుమార్‌రెడ్డి నూతనంగా 9493912212 సెల్‌నెంబర్‌ను సమాచారం కొరకు ఏర్పాటు చేశారు. ఇకమీదట పరస్పర సమాచారం చేరవేయడానికి పై నెంబరుతో పాటు 0861 - 2325125 నెంబరు కూడా అందుబాటులో ఉందని తెలిపారు.

## క్రీడాకారులకు టీషర్ట్‌లు

నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలో వేసవి ఉచిత క్రీడాశిక్షణ శిబరాల్లో కిక్ బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న 30మందికి కిమ్స్ ఆసుపత్రి నిర్వాహకులు బుధవారం టీషర్ట్‌లు బహుకరించారు. అందుకు జిల్లా కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు హరిత, కోచ్ సూర్యనారాయణ ఆసుపత్రి నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రసూనకు డాక్టరేట్

కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంకు చెందిన చీర్ల ప్రసూనకు ఎస్వీయూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. విక్రమ సింహపురి యూనివర్శిటీలో స్టాటిస్టిక్స్ విభాగంలో అకడమిక్ కన్సల్టెంట్‌గా వున్న తాను, రోగులు-మందులు-ఆసుపత్రులకు సంబంధించి 'పారామెట్రిక్ ఆర్‌ఓసి మోడల్స్ విత్ స్క్యూడ్ డిస్ట్రిబ్యూషన్స్ ఫర్ క్లాసిఫికేషన్ ఇన్ క్లినికల్ స్టడీస్' అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను ఈ డాక్టరేట్ లభించినట్లు ఆమె పేర్కొన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ప్రొఫెసర్ కెవిఎస్ శర్మ ఆధ్వర్యంలో ఈ పరిశోధన నిర్వహించి ఆ పరిశోధనా పత్రాలను ఎస్వీ యూనివర్శిటీకి సమర్పించగా, ఆ మేరకు యూనివర్శిటీవారు తనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారని ఆమె పేర్కొన్నారు.

## యోగా మిత్రమండలి

జిల్లాలోని యోగా మాస్టర్ల ఆధ్వర్యంలో నూతనంగా 'జిల్లా యోగా మిత్ర మండలి' అనే సంస్థను ఏర్పాటుచేసినట్లు ఆ మిత్రమండలి సంఘటనా కార్యదర్శి ఆచార్య ఆదిత్య తెలిపారు. నెల్లూరులోని ఆదిత్య కళాశాలలో బుధవారం యోగా మాస్టర్ల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆ మేరకు ఈ సంస్థకు కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా యోగా మిత్రమండలి గౌరవాధ్యక్షునిగా ముప్పిరాల సుబ్రహ్మణ్యం, అధ్యక్షునిగా విజయకుమార్, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, వేణు, రవిప్రకాష్, డిఎం దాసు, ఎన్.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులుగా ప్రసన్న, గంగరాజు, ఆనందరెడ్డి, పాపిరెడ్డి, బలిజేపల్లి వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు తెలిపారు. కోశాధికారిగా నజీర్‌బాషా, సంఘటనా కార్యదర్శిగా ఆచార్య ఆదిత్య, గౌరవ సలహాదారులుగా మస్తానయ్య, పొన్నగంటి శ్రీనివాసరావు ఎన్నికయ్యారని ఆయన పేర్కొన్నారు.

### శబరి శ్రీరామక్షేత్రంలో

## హనుమజ్జయంతి ఉత్సవాలు

నెల్లూరు రామ్‌నగర్‌లోని శబరి శ్రీరామక్షేత్రంలో ఈ నెల 28 నుంచి 31వ తేది వరకు హనుమజ్జయంతి ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తామని ఆలయ ఛైర్మెన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. 28వ తేది సాయంత్రం 5.30 గంటలకు ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుందని, అదే రోజు సాయంత్రం 6 గంటలకు స్వామివారికి ప్రత్యేక అలంకారం వుంటుందని పేర్కొన్నారు. రాత్రి 8 గంటలకు పల్లకిసేవ, 8.30కి నివేదన, హారతి వుంటాయన్నారు. 29, 30 తేదీల్లో ఉదయం 8 గంటలకు సుందరకాండ పారాయణం, 10 గంటలకు హోమం, సాయంత్రం 6గంటలకు ప్రత్యేక అలంకారం వుంటాయని, 31వ తేదీ ఉదయం 8 గంటలకు సుందరకాండ పారాయణం, 9.30 గంటలకు లక్షల మల్లెల అర్చన, అనంతరం 11 గంటలకు పూర్ణాహుతి, హారతి, ఆ తర్వాత సాయంత్రం 6 గంటలకు వెండి తమలపాకుల సమర్పణ, పూలంగి దర్శనం, రాత్రి 7 గంటలకు స్వామివారి వెండి డాలర్‌తో పిల్లలకు కంకణధారణ వుంటాయన్నారు. అనంతరం పల్లకీసేవ, రాత్రి 8.30 గంటలకు వైభవంగా స్వామివారికి నగరోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి శనివారం సాయంత్రం 6 గంటల దాకా విజయవాడ హనుమద్దీక్షా పీఠం వారి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. భక్తులందరూ ఈ ఉత్సవాలకు విచ్చేసి స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావలసిందిగా ఆయన విజ్ఞప్తిచేశారు.

## ధర్మ పరిరక్షణకే మహనీయుల ఆవిర్భావం

### - మహాసహస్రావధాని గరికపాటి



ధర్మ పరిరక్షణకే మహనీయులు.. మహాపురుషుల ఆవిర్భావం జరుగుతుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, మహా సహస్రావధాని డా. గరికపాటి నరసింహారావు అన్నారు. ఈ నెల 21న నెల్లూరు బాలాజీనగర్‌లోని వినాయకుని గుడివద్ద, సింహపురి ధార్మిక సంస్థ నిర్వాహకుడు ఉచ్చి భువనేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆధ్యాత్మికోపన్యాసం చేశారు. శ్రీనాధుడు రచించిన కాశీఖండంలోని గుణనిధి కధను ఆయన ఈ సందర్భంగా అద్భుతంగా వివరించారు. ధర్మాన్ని సంరక్షించేందుకే శ్రీకృష్ణ భగవానుడు, గౌతమబుద్ధుడు, శంకరాచార్యుల వంటి మహనీయులు ఉద్భవించారని ఆయన అన్నారు. మాజీ మునిసిపల్ ఛైర్మెన్ తాళ్లపాక అనూరాధ, టిడిపి నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, కార్పొరేటర్ అంచూరు జానకి తదితరులు పాల్గొన్నారు.

## పాపం... లోపం

(మొదటి పేజీ తరువాయి)

కాలాన్ని ఖర్చు చేస్తున్నాడు. పలు దేశాల ఇంజనీర్లు చేత డిజైన్‌లు గీయించాడు. ఎన్ని నగరాలను రోల్‌మోడల్‌గా చేసుకున్నాడో లెక్కేలేదు. ఇదంతా కూడా ప్రజలకు ఒక కామెడీగా వుంది. తమ రాజధాని బీజింగ్, టోక్యో, వాషింగ్టన్, సింగపూర్‌లా వుండాలని ప్రజలు కోరుకోవడం లేదు. తమ ప్రాంతాలు అభివృద్ధి చెంది, తమ అవసరాలు తీరితే చాలనుకుంటున్నారు. చంద్రబాబు చేపట్టిన అమరావతి రాజధాని అంకం సైతం ప్రజలను మెప్పించలేకపోతోంది.

అన్నింటిని మించి ఈమధ్య ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో వైకాపా ఎమ్మెల్యేలను తెలుగుదేశంలోకి లాక్కోవడం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను పెంచుతోంది. గొర్రెదాటును తలపిస్తున్న వైసిపి ఎమ్మెల్యేల కప్పదాట్లు ఎందుకోసమో, ఎన్ని కోట్లకోసమో ప్రజలకు తెలియంది కాదు. పార్టీ మారుతున్న ఎమ్మెల్యేల మీద ఎంత వ్యతిరేకతవుందో, వారిచేత పార్టీ మార్పిస్తున్న చంద్రబాబు మీద అంతకంటే వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పచ్చమీడియాను పక్కనపెట్టి స్వచ్ఛంధంగా ఏ మీడియా సంస్థ చేతనైనా రాష్ట్రంలో సర్వే జరిపిస్తే చంద్రబాబు మీద వలసల ముందుకంటే కూడా వలసల తర్వాత ప్రజల్లో వ్యతిరేకత విపరీతంగా పెరిగిందనే విషయం అర్ధమవుతుంది. వైకాపా ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకుని తెలుగుదేశాన్ని బలోపేతం చేస్తున్నానని చంద్రబాబు అనుకుంటే అంత మూర్ఖత్వం ఇంకోటి ఉండదు. రాష్ట్ర ప్రభుత్వ అనైతిక విధానాలను ప్రజలు నిరసిస్తున్నారు. అయితే ప్రభుత్వ అక్రమాలు, పాపాలు, లోపాలు ప్రతిపక్షానికి బలమవ్వాలి. కాని ప్రతిపక్షానికి ఇంకా బలమైన లోపం వుంది. అదే నాయకత్వ సమస్య. జగన్ తన పార్టీ ఎమ్మెల్యేలను నిలబెట్టుకోవడంలో విఫలమవుతున్నాడు. గత ఎన్నికల్లో కేడర్‌ను సమన్వయ పరచడంలో విఫలమయ్యే ఆయన అధికారంలోకి రాలేకపోయాడు. ముఖ్యంగా రాష్ట్ర స్థాయి నుండి బూత్ స్థాయికి కేడర్‌ను పటిష్టపరచాలి. పార్టీ సంస్థాగత పటిష్టతపై దృష్టిపెట్టాలి. ముఖ్యంగా తెలుగుదేశంలోకి కొత్తగా వస్తున్నవారి వల్ల అసంతృప్తులు, అలకలు తలెత్తుతున్నాయి. అలాంటి వారి మీద కూడా దృష్టిపెట్టాలి. జిల్లాల వారీగా కొత్త నాయకత్వాన్ని తీసుకురావాలి. ముఖ్యంగా అంబటి రాంబాబు, రోజా వంటి నోటి దురుసునోళ్లను కాకుండా సబ్జెక్ట్‌ను ప్రజల మనసుల్లోకి ఎక్కించే సీనియర్లను అధికార ప్రతినిధులుగా ప్రయోగించాలి. ముఖ్యంగా జగన్ కొంతవరకన్నా తన తండ్రి వైయస్‌లోని నాయకత్వ లక్షణాలను, ప్రజలతో, నాయకులతో మెలిగే తీరును తెచ్చుకోగలిగితే ఆయన రాజకీయ భవిష్యత్ మారడం ఖాయం.

# 'ఐకానిక్ ఉమెన్ ఆఫ్ ది డికేడ్' దీపమ్మ

## ఢిల్లీలో ఘన సత్కారం



కేంద్రమంత్రి స్మృతి ఇరానీ నుండి 'ఐకానిక్ ఉమెన్ ఆఫ్ ది డికేడ్' అవార్డును స్వీకరిస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, పక్కన ఆమె తల్లి ఉషమ్మ

నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని తమ స్వగ్రామంలో స్వర్ణభారత్ ట్రస్ట్ ఏర్పాటుచేసి, తద్వారా గ్రామీణ ప్రజానీకానికి విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో గణనీయమైన సేవలందిస్తోన్న దీపా వెంకట్‌కు ఢిల్లీలో ఘనమైన సత్కారం జరిగింది. స్వర్ణభారత్ ట్రస్ట్ స్వచ్ఛంధసంస్థ ద్వారా ప్రజలకు ఎన్నో రకాల సేవలందించడంతో పాటు, నైపుణ్యాభివృద్ధిలో యువత ముందంజవేసేందుకు ఎంతగానో కృషి చేస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్‌కు ఎంతో ప్రతిష్టాత్మకమైన 'ఐకానిక్ ఉమెన్ ఆఫ్ ది డికేడ్' పురస్కారం లభించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన 'ఉమెన్ ఎకనమిక్ ఫోరం' సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు ఈ విశిష్ట సన్మానం జరిగింది. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ చేతుల మీదుగా ఈ విశేష పురస్కారాన్ని ఆమె అందుకున్నారు. ఈ సందర్భంగా దీపా వెంకట్ మీడియాతో మాట్లాడుతూ, ఈ అవార్డు తనకు లభించడం తనకెంతో ఆనందదాయకమన్నారు. ఇంతటి విశిష్టమైన అవార్డు తమ సంస్థ స్వర్ణభారత్ ట్రస్ట్‌కే వచ్చిందని తాను భావిస్తున్నానన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చిన విధంగా 'మేకిన్ ఇండియా' నినాదం విజయవంతం కావాలంటే ప్రభుత్వాలతో పాటు, ప్రైవేటు సంస్థలు కూడా తమ నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు కృషి చేయాలని ఆమె అభిప్రాయపడ్డారు. తనకు రాజకీయాల్లోకి వచ్చే ఆలోచనే లేదని, ప్రజలకు సేవచేయాలన్నదే తన అభిమతమని ఆమె స్పష్టం చేశారు. కాగా, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడి కుమార్తె, స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ అయిన దీపా వెంకట్ తండ్రికి తగ్గ తనయ అనిపించుకుంటూ ప్రజాసేవా రంగంలో ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు విశిష్టమైన సేవలందిస్తూ ప్రజలందరి ప్రశంసలు అందుకుంటున్నారు. జాతీయ స్థాయిలో ఇంతటి విశిష్టమైన 'ఐకానిక్ ఉమెన్ ఆఫ్ ది డికేడ్' పురస్కారం లభించడం పట్ల స్థానిక ప్రముఖులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఆమెకు తమ శుభాకాంక్షలు తెలిపారు.

## టోల్‌పై...

# స్పందించిన వెంకయ్య

### • గడ్కరీకి లేఖ



నెల్లూరు నగర పరిధిలో జాతీయ రహదారిపై కనుపర్తిపాడు క్రాస్ వద్ద ఏర్పాటు చేయతలపెట్టిన టోల్‌గేటును ఎత్తేయాలని కోరుతూ నెల్లూరీయుడు, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ వ్రాసారు. ఈ టోల్‌గేటు నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ఉన్నందున్న నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులుకు గురయ్యే అవకాశముంది. నెల్లూరుకు 15కిలోమీటర్ల దూరంలోనే వెంకటాచలం టోల్‌గేటు వుంది. నిబంధనల ప్రకారం ఇక్కడ టోల్‌గేటు ఏర్పాటు తగదు. నెల్లూరు నగరం భారీగా విస్తరించి వున్నందున ప్రజలు జాతీయ రహదారిపై ఎక్కువుగా ప్రయాణాలు సాగిస్తుంటారు. నేనూ నెల్లూరువాడినే! ఈ టోల్ గేటు పెడితే వచ్చే ఇబ్బందులేమిటో నాకూ తెలుసు. కాబట్టి ఈ టోల్‌గేటును రద్దు చేయాలని ఆయన గడ్కరీని కోరారు. వెంకయ్య కోరితే గడ్కరీ ఈ టోల్‌గేటును రద్దు చేయకుండా వుంటాడా? పనైపోయినట్లే!

# అద్భుత విజయం

## • సత్తాచాటిన ఇస్రో శాస్త్రవేత్తలు



నెల్లూరుజిల్లా సూళ్లూరుపేట శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో సోమవారం జరిగిన ఆర్ఎల్‌విటిడి ప్రయోగం ఆ రంగంలో విప్లవాత్మక మార్పులకు తొలి అడుగు. ఇప్పటికే ఇస్రో అంతరిక్ష ప్రయోగాలలో అద్భుత విజయాలతో దూసుకుపోతూ ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలను ఆకట్టుకుంటోంది. అగ్రరాజ్యమైన అమెరికా నుంచి చిన్నచిన్న దేశాల వరకు తమ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపేందుకు మన దేశాన్ని ఆశ్రయిస్తుండడం ఇస్రో ప్రతిభకు తార్కాణం. ఇంకా కారుచౌకగా రోదసిలోకి ఉపగ్రహాలను చేర్చేందుకు దేశ అంతరిక్ష రంగంలో నిశ్శబ్ద విప్లవంగా రీయుజబుల్ రాకెట్‌ను ఇస్రో రూపొందిస్తోంది.

ఈ రాకెట్ సాంకేతిక సామర్ధ్యాన్ని సమర్ధవంతంగా సాధించేందుకు ప్రయోగాలు చేస్తోంది. ఇందులో భాగంగా తొలి ఆర్ఎల్‌విటిడి(రీయూజబుల్ లాంచ్ వెహికల్ టెక్నికల్ డమానుస్ట్రేషన్) ప్రయోగాన్ని సోమవారం షార్ నుంచి విజయవంతంగా నిర్వహించి భారత స్పేస్ షటిల్‌ను రూపొందించుకొంటుందన్న నమ్మకాన్ని ప్రపంచానికి శాస్త్రవేత్తలు చాటిచెప్పారు. ఈ కొత్త తరహా రాకెట్ పనితీరును పరీక్షించేందుకే ప్రయోగం జరుపుతుండటంతో ప్రచారానికి ఇస్రో దూరంగా ఉండిపోయింది. ఇప్పటివరకు వరుస విజయాలు సాధిస్తుండటంతో అన్ని పత్రికలు, టీవీ ఛానల్స్ ఇస్రోకు బ్రహ్మరథం పడుతున్నాయి. ఈ క్రమంలో ఆర్ఎల్‌వి సాంకేతిక పరీక్ష ప్రయోగంలో ఏదైనా వైఫల్యం ఎదురైతే విమర్శలు ఎదుర్కోవలసి వస్తుందని ఇస్రో ఈ ప్రయోగానికి మీడియాను దూరంగా ఉంచినట్లు సమాచారం. ప్రస్తుతం తక్కువ ఖర్చుతో ఉపగ్రహాలను రోదసిలోకి చేరవేసేందుకు స్వదేశీ స్పేస్‌షటిల్ ఆర్ఎల్‌వి తయారీకి ఇస్రో కృషి చేస్తూ తొలి ఆర్ఎల్‌వి సాంకేతిక పరీక్షను సైతం అద్భుతంగా నిర్వహించడం ఇస్రో శాస్త్రవేత్తల సత్తాను తెలియజేస్తోంది.

# మహానాడులో బీదకు కీలక బాధ్యత



ఈ నెల 27 నుండి తిరుపతిలో మూడురోజుల పాటు నిర్వహించనున్న తెలుగుదేశంపార్టీ జాతీయ మహానాడుకు సంబంధించి జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు బీద రవిచంద్రకు కీలక బాధ్యతలు అప్పగించారు. ఆయనను మహానాడు ప్రాంగణ పరిశీలకునిగా నియమించారు. ఆయనకు 36మంది వాలంటీర్లను కూడా ఏర్పాటు చేశారు. మహానాడు ప్రాంగణంలో ఏర్పాట్లు, వసతులు, వివిధ సెట్టింగ్‌లు వంటివన్నీ కూడా ఆయన పర్యవేక్షణలోనే జరిగాయి.

# ఏపి ఐసెట్‌లో వెంకటేశ్వర విద్యార్థి ప్రతిభ



ర్యాంకర్‌ను అభినందిస్తున్న కాలేజీ యాజమాన్యం

రాష్ట్ర స్థాయిలో ఏపి ఐసెట్-2016 ఫలితాల్లో నెల్లూరుజిల్లా కొడవలూరు మండలం నార్త్‌రాజుపాళెంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ డిప్లొమా విద్యార్థి యం. పూర్ణానంద్ ట్రిబుల్ ఇ విభాగంలో 34వ ర్యాంక్‌ను, టిఇసెట్-2016లో 11వ ర్యాంక్‌ను సాధించినట్లు కాలేజీ ఛైర్మన్ డా॥ పెనుబల్లి బాబునాయుడు, ప్రిన్సిపల్ డా॥ బి.దత్తాత్రేయశర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా 2015-16 విద్యా సంవత్సరానికి గాను జెఎన్‌టియు అనంతపురం విడుదల చేసిన బిటెక్ ఫైనల్ ఇయర్ రెండవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి విజయ దుంధుభి మ్రోగించినట్లు పేర్కొన్నారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com